teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 145 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 20 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## విద్యాసంస్థలకు దసరా సెలవుల ప్రకటన

**అక్టోబర్ 02 నుండి 14 వరకు ఉండనున్న సెలవులు**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే పండుగల్లో దసరా ఒకటి. కాగా దసరా పండుగ సమీపిస్తోన్న నేపథ్యంలో విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి అక్టోబర్ 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 15వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ స్కూళ్ల అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నది. కొన్ని ప్రైయివేటు పాఠశాలలు అక్టోబర్ 1వ తేదీ నుంచి సెలవులు ఇస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. మళ్లీ అక్టోబర్ 15వ పునః ప్రారంభం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం కూడా అందినట్లు తెలుస్తోంది. ఓవరాల్‌గా ఈ ఏడాది విద్యాసంస్థలకు 13 రోజుల పాటు దసరా పండగ సెలవులు రానున్నాయి.

క్లాస్ రూమ్‌లోకి ఫోన్ తీసుకెళితే

# కఠిన చర్యలు

**చదువుకు భంగం కలుగుతుందని నిర్ణయం**

**తాజాగా ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు క్లాస్ రూమ్‌లోకి ఫోన్ తీసుకెళితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. టీచర్లు తరగతి గదుల్లోకి ఎలాంటి సెల్‌ఫోన్‌లను తీసుకెళ్ల కూడదని విద్యాశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. తరగతి గదుల్లోకి ఫోన్లను తీసుకెళితే అది

మిగతా 2 లో



**కేబినెట్ భేటీలో హైడ్రాకు**

## చట్టబద్ధత కల్పించేలా

# ఆర్డినెన్స్



తెలుగు మహిళా యూనివర్సిటీల పేర్లలో జరగనున్న మార్పులు
భారీ ఎజెండా నేపథ్యంలో సుదీర్ఘంగా సాగనున్న భేటీ
వరదలు, బీసీ కుల గణనపై కూలంకషంగా జరగనున్న చర్చ
నేడు భేటీకానున్న తెలంగాణ మంత్రివర్గం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం భేటీకానుంది. సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి.**



హైదరాబాద్, సెప్టెంబరు 19 (తీన్మార్ న్యూస్): 'హైడ్రా'కు చట్టబద్ధత కల్పించేలా ఆర్డినెన్స్ మొదలు ధరణి కమిటీ సిఫారసులు, రికార్డ్స్ ఆఫ్ రైట్స్-2024 ముసాయిదా, రెండు యూనివర్సిటీలకు, ఒక సంస్థకు కొత్త పేర్లు పెట్టడం, వరద సహాయక చర్యలు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రైతు

మిగతా 2 లో

## నేడు ప్రారంభంకానున్న కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ

**కమిషన్ ముందుకు రానున్న ఎడుగురు సీఈ స్థాయి ఇంజనీర్లు**



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ శుక్రవారం నుంచి మళ్లీ ప్రారంభం కానుంది. రేపు కమిషన్ ముందుకు ఎడుగురు సీఈ స్థాయి ఇంజనీర్లు రానున్నారు. కమిషన్ బహిరంగ విచారణకు రీసెర్చ్ ఇంజనీర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు రానున్నారు. గత నెలలో కమిషన్.. 15 మందికిపైగా విచారణ చేసింది. రేపటి నుంచి 25 మందికి పైగా కమిషనర్ జస్టిస్ పీనాకి చంద్ర ఘోష్ విచారణ

మిగతా 2 లో



కేయులో పీహెచ్డీ నోటిఫికేషన్‌కు

# ఆదేశాలు జారీ

**సవరించిన నిబంధనల మేరకు నోటిఫికేషన్ విడుదల**

హన్మకొండ కేయు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): 2024 %-% 25 సంవత్సరము నుంచి సవరించిన %ాష్ట్ర.ణ% నిబంధనల మేరకు 2024 %-% 25 విద్యా సంవత్సరానికి గాను %ాష్ట్ర.ణ% లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ను వైస్ ఛాన్సలర్ ఇంచార్జ్ కరుణ వాకాటి ఆదేశాల మేరకు ఫాకల్టీల వారిగా విడుదల చేయాలనీ అని కోరుతూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి ఉత్తర్వులు జారి చేసారు. విభాగాల వారిగా ఖాళిల మేరకు ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు ఖాళిలకు అనుగుణంగా జనవరి మరియు జూలై నెలల్లో దరఖాస్తులు కోరనునట్టు ఆ ఉత్తర్వులులో పేర్కొన్నారు. ఫెలోషిప్ హోల్డర్స్ (UGC NET/CSIR NET/CEED/DBT/NFPWD/DST INSPIRE or FIP/QIP) మరియు NET/GATE/GPAT ఇతర జాతీయ స్థాయి పరిక్షల స్కోర్ ఆధారంగా నోటిఫికేషన్ లు విడుదల చేయాలనీ అ ఉత్తర్వులు లో కోరారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.kakatiya.ac.in లో చూడవచ్చు అన్నారు.



## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో సీఎం సమావేశం

ఈ దసరా నుంచి ప్రారంభంకానున్న తరగతులు

సమావేశంలో పాల్గొన్న ఏపీ సీఎం కోడలు నారా బ్రాహ్మణి

.. వివరాలు 2లో

# సుకన్య సమృద్ధి యోజన పథకంతో అవకతవకలు..?

**పథకం అమలు నియమాల్లో మార్పులు**

ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే సుకన్య సమృద్ధి యోజన. అయితే తాజాగా ఈ పథకంలో అవతవకలు జరుగుతున్నట్లు తెలియడంతో ప్రభుత్వం కొత్త నియమాలను ప్రకటించింది. సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రకారం ఆడపిల్లలున్న తల్లిదండ్రులు మాత్రమే ఇందుకు ఈ పథకానికి అర్హులు. అయితే కొన్ని సందర్భాల్లో పాపకు తాత, అమ్మమ్మ, నాన్నమ్మలుగా బంధుత్వం కలవారు కూడా సుకన్య సమృద్ధి యోజన ప్రకారం అకౌంట్లు ఓపెన్ చేసి డిపాజిట్లు చేస్తున్నట్లు తెలిసింది.



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 అవతవకలు(తీన్మార్ న్యూస్): పైగా ఒకటి కంటే ఎక్కువ సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లు కొందరు కలిగి ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఆగస్టు 21, 2024న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సుకన్య సమృద్ధి యోజనకు సంబంధించి నియమాల్లో మార్పులు చేసింది.

**మారిన నియమాల ప్రకారం..**

పాప (గ్రాండ్ పేరేంట్స్ (తాత, అమ్మమ్మ, నాన్నమ్మ)లు

మిగతా 2 లో



## దసరాలోపు రైతు భరోసా రిలీజ్‌కు ప్రభుత్వం సన్నాహాలు

**భరోసా నిధుల పైన ఓ కీలక నిర్ణయం తీసుకోనున్న కేబినెట్**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రైతులకు అదిరిపోయే శుభవార్త అందింది. దసరాలోపు రైతు భరోసా నిధులు రిలీజ్ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈరోజు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం

మిగతా 2 లో



## పార్టీ కార్యాలయ కూల్చివేతపై స్పందించిన నాయకులు

దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదంటూ ఆరోపణలు

మా పార్టీకి ఓ న్యాయం.. మిగతా పార్టీలకు మరో న్యాయమా..

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

2లో





రాహుల్ గాంధీ, ఖర్గేలకు హరీశ్ రావు

# బహిరంగ లేఖ

**రేవంత్ రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ సారాంశం**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీమంత్రి, సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తాజాగా లేఖ రాశారు. రాహుల్ గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కూడా ఆయన బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ ఆ లేఖలో హరీశ్ రావు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 2 లో

ఒకే దేశం, ఒకే ఎన్నికలుపై

# స్పందించిన కేటీఆర్

ఎలా నిర్వహిస్తారో ప్రజలకు వెల్లడించాల్సి ఉంది:కేటీఆర్

కేంద్రం స్పష్టత తర్వాతే బీఆర్ఎస్ వైఖరిని తెలుపుతాం



.. వివరాలు 2లో

## పల్లెవెలుగు బస్సులలో అందుబాటులోకి స్కాన్ సిస్టమ్

**ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): సాధారణంగా చాలా మంది బస్సుల్లో ఎక్కువగా జర్నీలు చేస్తుంటారు. ఇక తెలంగాణ సర్కారు

మిగతా 2 లో





## ఎంపీ రఘునందన్ రావుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం

న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలంటూ సీజేకు న్యాయమూర్తి లేఖ

2లో

# కేబినెట్ భేటీలో హైడ్రాకు "చట్టబద్ధత కల్పించేలా" ఆర్డినెన్స్

**మొదటి పేజీ తరువాయి**

రుణ మాఫీ, రైతు భరోసా, బీసీ కుల గణన, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. ఎజెండా భారీగా ఉన్న నేపథ్యంలో భేటీ సుదీర్ఘంగా కొనసాగుతుందని అధికారులు భావిస్తున్నారు. వరదలు, హైడ్రా ఆర్డినెన్స్, బీసీ కుల గణన వంటివాటిపై కూలంకషంగా చర్చించాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు. హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ.. ఫోర్త్‌సిటీలో ఏర్పాటు చేస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని నిర్ణయించింది. ఈ మూడింటికీ శుక్రవారం ఆమోదముద్ర పడనుంది. ఇటీవలి వరదల వల్ల దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పంట, ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం లెక్క తేల్చింది. కేంద్ర ప్రభుత్వానికి వివరాలను సమర్పించింది. దీనిపైనా మంత్రివర్గం చర్చించనుంది. హైడ్రాకు విశేషాధికారాలు కల్పించేలా ఆర్డినెన్స్‌ను తీసుకురానుంది. తదుపరి జరిగే అసెంబ్లీలో హైడ్రా చట్టాన్ని తీసుకురానుంది. ఇటీవల ధరణి కమిటీ చేసిన 54 సిఫారసులపైనా చర్చించి, అమలుపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో బీసీ కుల గుణన చేసి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే..! ఇది పూర్తయితే తప్ప.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి, పాలక వర్గాలను ఏర్పాటు చేస్తేనే... కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు వస్తాయి. ఈ దృష్ట్యా పంచాయతీ




ఎన్నికలకు ప్రతిబంధకంగా ఉన్న బీసీ కుల గణనను చేపట్టే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేయాలనుకుంటున్న 225 గ్రామ పంచాయతీలు, ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న మునిసిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనంపైనా మంత్రివర్గం చర్చించనుంది. రైతు రుణ మాఫీ కింద మిగతా రుణాలను మాఫీ చేయడం, రైతు భరోసా విధివిధానాలు, 'రికార్డ్ ఆఫ్ రైట్స్-2024' ముసాయిదా అంశం కూడా చర్చకు రానున్నాయి.

## జిల్లాలో పర్యటించనున్న మంత్రులు

**సీఎంతో పాటు మంత్రులు ఉత్తమ్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మండలి చైర్మన్**



నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): నల్గొండ జిల్లాలో మంత్రులు పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నల్గొండలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రులు ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పరిశీలించనున్నారు. అమెరికాలోని రాబిన్ సన్ సంస్థ నూతన టెక్నాలజీని వాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాల్లో SLBC పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఖర్చుకు వెనుకాడేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అయితే మరోవైపు నూతన టెక్నాలజీతో ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉందంటుని అధికార వర్గాలు వెల్లడించాయి. రేపు కేబినెట్‌లో ఎజెండాగా SLBC అంశంపై చర్చ జరుగనుంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ జిల్లా ప్రాజెక్టులపై వివక్ష చూపిందని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ఈ నెల 20న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల SLBC టన్నెల్ పరిశీలన, ఇరిగేషన్ అధికారులతో సమీక్షతో నల్గొండ జిల్లా ప్రాజెక్టుల దశ మారనుందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.

## క్లాస్ రూమ్‌లోకి ఫోన్ తీసుకెళితే కఠిన చర్యలు



**మొదటి పేజీ తరువాయి**

చదువుకు భంగం కలుగుతుందని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. తరగతి గదుల్లోకి అయితే ఇప్పటికే సెల్‌ఫోన్లను తరగతి గదుల్లోకి తీసుకెళ్ల కూడదని ఆదేశాలున్నప్పటికీ కొందరు టీచర్లు వాటిని క్లాస్‌ల్లోకి తీసుకెళుతూ ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్నారని పేర్కొంది. ఈ విషయం కలెక్టర్ల ఆకస్మిక తనిఖీల్లో వెల్లడి కావడం, తరగతి గదుల్లో ఎక్కువ సమయం ఫోన్లతోనే గడుతుపుతుండటాన్ని గుర్తించిన విద్యాశాఖ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఫోన్లు తరగతి గదుల్లోకి తీసుకుని వెళ్లాలంటే ఖచ్చితంగా హెడ్ మాస్టర్ అనుమతి తీసుకోవాలని చెప్పింది. లేకుంటే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చింది.

## రాహుల్ గాంధీ, ఖర్గేలకు హరీశ్ రావు బహిరంగ లేఖ

**మొదటి పేజీ తరువాయి**

ఉపయోగిస్తున్న భాష, వ్యాఖ్యలను అరికట్టాలంటూ లేఖలో హరీశ్ రావు రిక్వెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న భాష, వ్యాఖ్యలను కట్టడి చేయండి. అటువంటి వ్యాఖ్యలు రాజకీయాల్లో వాడటం అంత మంచిదికాదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఏ మాత్రం పాటించడంలేదు. మాజీ సీఎం కేసీఆర్ పై ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవన్నీ కూడా సీఎం రేవంత్ రెడ్డి దిగజారుడు తనానికి అత్యంత నిదర్శనం. రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు తీవ్రవాది అంటూ వ్యాఖ్యలు చేసినప్పుడు కాంగ్రెస్ వెంటనే స్పందించి, దేశవ్యాప్తంగా నిరసనలను చేపట్టింది. రాజ్యాంగ విలువలను దిగజారుస్తూ మాట్లాడుతున్నారంటూ నాడు ఖండించింది. రాజకీయాల్లో ఇటువంటి దిగజారుడు విమర్శలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామంటూ కాంగ్రెస్ పేర్కొన్నది. ఇప్పుడు అదేవిధంగా వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్ రెడ్డిపై చర్యలేవీ? ఇది కాంగ్రెస్ పార్టీ డబుల్ స్టాండర్డ్స్ కు నిదర్శనమేగా? ఢిల్లీలో ఒక రూల్.. గల్లీలో మరో రూల్ ఫాలో అవుతారా? ఈ విధంగా డబుల్ రోల్స్ ప్లే చేయడం కాంగ్రెస్ కే చెల్లుతుంది. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఉన్నాయి. కాంగ్రెస్ తన నైతిక ప్రమాణాలను పాటించకుండా ఇతరులకు నీతులు చెప్పడం చూస్తుంటే నవ్వొస్తుంది. కాంగ్రెస్ హైకమాండ్ అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేను డిమాండ్ చేస్తున్నాను. కేసీఆర్ ను రాళ్లతో కొట్టాలంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటువంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ హైకమాండ్ సమర్థిస్తుందా? రేవంత్ రెడ్డి ఆ విధంగా వ్యవహరిస్తూ తన స్థాయిని దిగజార్చుకుంటున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామంటూ పదే పదే పేర్కొనే రాహుల్ గాంధీ.. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై నిరాధార కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. ఇది అత్యంత దుర్మార్గం. రేవంత్ నాయకత్వంలో రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుంది. వెంటనే రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ హైకమాండ్ చర్యలు తీసుకోవాలి అంటూ హరీశ్ రావు ఆ లేఖలో పేర్కొన్నారు.

## సుకన్య సమృద్ధి యోజన పథకంతో అవకతవకలు..?



**మొదటి పేజీ తరువాయి**

చట్టపరంగా గార్డియన్ షిప్ తీసుకోవాలి. లేదా అకౌంట్ మరో లీగల్ గార్డియన్, తల్లిదండ్రులకు ట్రాన్స్ ఫర్ చేయాలి. 2019 సుకన్య సమృద్ధి యోజన చట్టం ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లు కలిగి ఉంటే నియమాలను ఉల్లంఘించనట్లే. అలాంటి సందర్భంలో ఒక అకౌంట్ తప్ప మిగిలన అకౌంట్లన్నీ నిలిపివేయబడతాయి. పాప పాన్ కార్డు, ఆధార్ కార్డు అలాగే గార్డియన్ (తల్లిదండ్రులు లేదా లీగల్ గార్డియన్) పాన్, ఆధార్ కార్డు అకౌంట్ కలిగిన బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీసులో అప్డేట్ చేయడం తప్పనిసరి. ఆధార్, పాన్ కార్డు అప్డేట్ చేయని స్మాల్ సేవింగ్స్ అకౌంట్లపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. పై చెప్పిన నియమాలను ఖాతాలందరూ పాటించాలి. లేకుంటే ఆ అకౌంట్స్ ను ప్రభుత్వం సెటిల్ మెంట్ చేసే అవకాశముంది. సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్ల చదువు, వివాహం, ఇతర భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంలో ప్రతి నెలా కనీష్ఠ డిపాజిట్ రూ.250, గరిష్టంగా సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు చేసుకోవచ్చు. డిపాజిట్ పై తాజా త్రైమాసిక వడ్డీ రేట్ల ప్రకారం.. 8.2 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ అకౌంట్లో పెట్టుబడిపై డిపాజిట్ ప్రారంభించిన 21 సంవత్సరాల తరువాత మెచూరిటీ లభిస్తుంది. తల్లిదండ్రులు లేదా గార్డియన్స్ అమ్మాయికి 18 సంవత్సరాల వయసు వచ్చేవరకు ఈ అకౌంట్ ని పర్యవేక్షిస్తారు.

## ఎంపీ రఘునందన్ రావుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): మెదక్ ఎంపీ రఘునందన్ రావుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుమోటో క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా సీజే ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీజేకు హైకోర్టు న్యాయమూర్తి లేఖ రాశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు ఇచ్చిన స్టే పై రఘునందన్ వ్యాఖ్యలు చేశారని న్యాయమూర్తి తెలిపారు. ఆగస్టు 24న రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేసి న్యాయవస్థకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని న్యాయమూర్తి వెల్లడించారు. న్యాయవ్యవస్థ పట్ల రఘునందన్ రావు అగౌరవం కలిగి ఉన్నారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల న్యాయస్థానం ప్రతిష్ట మసకబారుతుందని న్యాయమూర్తి లేఖలోవివరించారు. కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా ఎందుకు పరిగణనలోకి తీసుకోరాదో వివరణ ఇవ్వాలంటూ రఘునందన్ రావుకు సీజే ధర్మాసనం నోటీసులు జారీచేసింది.

## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో సీఎం సమావేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ బోర్డు మీటింగ్‌లో సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో చైర్మన్ శ్రీని రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు కోడలు, మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి పాల్గొన్నారు. అయితే, నారా బ్రహ్మణి హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అయితే, తెలంగాణలో ఏర్పాటు చేయబోయే స్కిల్ యూనివర్సిటీలో భాగంగా ఆమె చర్చల్లో పాల్గొనడం ఆసక్తిగా మారింది. కాగా, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ ఏడాది దసరా నుంచి ఆరు కోర్సులతో తరగతులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల వద్ద 57 ఎకరాల స్థలంలో స్కిల్ వర్సిటీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కానీ, ఈ ఏడాది తాత్కాలికంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లేక న్యాక్ లేదా నిథమ్‌లో వర్సిటీ నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది.

## ఒకే దేశం, ఒకే ఎన్నికలు పై స్పందించిన కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): ఒకే దేశం, ఒకే ఎన్నికలు పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దీనిని ఎలా అమలు చేస్తారనే అంశంపై కేంద్రం స్పష్టతను ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ తన వైఖరిని తెలియజేస్తుందని కేటీఆర్ వెల్లడించారు. జమిలి ఎన్నికలను ఎలా నిర్వహించాలని కేంద్రం భావిస్తుందో తెలియాల్సి ఉందని, ఈ ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యాక తమ నిర్ణయం వెల్లడిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక దేశం, ఒకే ఎన్నికలు' కోసం తన ప్రణాళికను దేశ ప్రజల ముందుకు తీసుకురావాలి. ప్రభుత్వం ఈ ఎన్నికలను ఎలా నిర్వహిస్తుంది, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలాలను ఎలా రద్దు చేస్తారు, ఎలా నిర్వహిస్తారు అనేది తెలియాల్సి ఉంది. ఈ రెండింటిని ఎలా నిర్వహిస్తారో ప్రజలకు వెల్లడించాల్సి ఉంది అని పేర్కొన్నారు. ఎక్కడైనా ఉప ఎన్నికలు వస్తే ఏం చేస్తారనేది కూడా తెలియాల్సి ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికలు నాలుగైదు నెలల క్రితమే ముగిసినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్కు నాలుగు సంవత్సరాలకు పైగా సమయం మిగిలి ఉందని గుర్తు చేశారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ప్రభుత్వం ముందుగా రద్దు చేస్తుందా? లేదా క్రమంగా జమిలి ఎన్నికలను నిర్వహించాలని యోచిస్తుందా? తెలియాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం ద్వారా ఎన్నికలు ఒకేసారి నిర్వహించే ఆలోచన ఉందా? అనేది తెలియాలన్నారు.

## పల్లెవెలుగు బస్సులలో అందుబాటులోకి స్కాన్ సిస్టమ్

**మొదటి పేజీ తరువాయి**

ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల బస్సులు ఏ సీజన్ లో చూసిన కూడా ఫుల్ రష్ గా ఉంటున్నాయి. మరోవైపు బస్సులో తరచుగా చిల్లర విషయంలో గొడవలు జరుగుతుంటాయి. కండక్టర్ లు టికెట్ లకు సరిపడ చిల్లర ఇవ్వాలని చెప్తున్న కూడా చాలా మంది చిల్లర విషయంలో మాత్రం అస్సలు పట్టించుకోరు. పైగా కండక్టర్ లు, డ్రైవర్ లతో గొడవలకు కూడా దిగుతుంటారు. చాలా సార్లు బస్సులలో టికెట్ విషయంలో గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే లగ్జరీ బస్సులు, దూర ప్రాంతాలకు వెళ్లే డీలక్స్ లు,సూపర్ లగ్జరీ బస్సులలో టికెట్ ల కోసం స్కాన్ సిస్టమ్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం తాజాగా, గ్రామాల్లో ఎక్కువగా తిరిగే పల్లెవెలుగు బస్సులలో కూడా ఈ స్కాన్ సిస్టమ్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.ఫోన్ పేలు, గూగుల్ పేలు, స్కాన్ సిస్టమ్, క్రెటిట్, డెబిట్ కార్డులతో అన్నిరకాల డిజిటల్ చెల్లింపుల్ని సైతం.. ఇక మీదట యాక్సెప్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఈ మేరకు ఐటిమ్స్ (ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్)లో సాఫ్ట్‌వేర్‌ను సైతం అప్డేట్ చేశారు. ప్రయాణికులు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, డెబిట్, క్రెడిట్‌కార్డులతో పాటు ఇతర డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్లు పొందే అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. దీని వల్ల గ్రామాల్లోని ప్రయాణికులు సైతం.. బస్సులలో ఇక మీదట చిల్లర సమస్యలతో ఇబ్బందులు దూరమయ్యాయని చెప్పుకొవచ్చు. చాలామంది ప్రయాణికులు స్మార్ట్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తుండటం, డబ్బులు తమతో పాటుగా పెట్టుకొక పోవడం వల్ల చిల్లర సమస్యఏర్పడేది. దీంతో తాజాగా తీసుకున్న నిర్ణయం పట్ల.. ప్రజలు కూడా ఫుల్ హ్యాపీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ ఏర్పాటు చేసిన డిజిటల్ పేమెంట్లు, క్యూఆర్ కోడ్‌తో అన్ని రకాల సేవలను ఇక మీదట పొందవచ్చు.. ఒక్కసారి కోడ్ స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించిన పది రకాల యాప్‌లు వినియోగించుకునే ఛాన్స్ ఉంది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్(వెబ్‌సైట్), గమ్యం(ఆండ్రాయిడ్ ఐఓఎస్) తదితర సేవలను ప్రయాణికులు పొందవచ్చని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

## పార్టీ కార్యాలయ కూల్చివేతపై స్పందించిన నాయకులు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): పార్టీ ఆఫీసు నిర్మాణం విషయంలో బీఆర్ఎస్‌కు ఒక న్యాయం మిగతా పార్టీలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు గులాబీ పార్టీ నేతలు. నల్లగొండలో బీఆర్ఎస్ ఆఫీసును కూల్చివేయాలని కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పార్టీ నేతలు స్పందించారు. ఇది కాంగ్రెస్ కుట్రలో భాగమని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మేము ఏ పార్టీ ఆఫీసు జోలికి వెళ్లలేదు. తెలంగాణలో ఏ పార్టీ ఆఫీసుకు అనుమతులు లేవు. నిబంధనల ప్రకారమే లీజుకు తీసుకుని అనుమతి కోసం దరఖాస్తు చేశాం. 5800 గజాల్లో పార్టీ ఆఫీసు నిర్మాణం కోసం దరఖాస్తు పెట్టుకున్నాం. 2019లో ఆఫీసు నిర్మాణం చేపట్టి 2020లో పూర్తి చేశాం. నిర్మాణంపై మేము దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదు. ఆనాటి కమిషనర్ ఆఫీసు నిర్మించుకోమని చెప్తేనే మేము ముందుకు వెళ్లాం.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కావాలనే ఆఫీసును కూల్చేస్తా అని మాట్లాడారు. కోమటిరెడ్డికి చట్టమేమీ చుట్టం కాదు. మాకు న్యాయం జరుగుతుందనుకుంటే అన్యాయం జరిగింది. కోర్టు తీర్పుపై మరో కోర్టును ఆశ్రయిస్తాం. కోమటిరెడ్డి ఎన్ని కుట్రలు చేసినా ఫలించవు. ఆఫీసు భవనాన్ని ప్రజలు, ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగిస్తామంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. బీఆర్ఎస్ కార్యాలయం కూలిస్తే ఏం వస్తుంది. ఒకసారి కూలిస్తే అనుమతులు తీసుకుని నాలుగింతల నిర్మాణం చేస్తాం. మీలా మాకు కూల్చడం తెలియదు. నిలబెట్టడం మాత్రమే తెలుసు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక న్యాయం మిగతా పార్టీలకు మరో న్యాయమా.. మిగతా పార్టీల కార్యాలయాలకి కూడా అనుమతులు లేవు. వాటిని కూల్చే దమ్ము మంత్రి కోమటిరెడ్డికి ఉందా?. పార్టీ ఆఫీసును కూల్చడానికి అధికారులు కాకుండా కోమటిరెడ్డి అనుచరులు వస్తున్నారు. వారే జేసీబీలు తీసుకువస్తున్నారు. కేసీఆర్ హయాంలో నల్లగొండలో రూ.374 కోట్ల పనులు జరిగాయి. మరి వాటి సంగతేంటి? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చివేయడం పాపమే అవుతుంది.

## దసరాలోపు రైతు భరోసా రిలీజ్ కు ప్రభుత్వం సన్నాహాలు

**మొదటి పేజీ తరువాయి**

కానుంది. ఈ సమావేశంలో రైతు భరోసా నిధుల పైన ఓ కీలక నిర్ణయం తీసుకోనుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన రైతు భరోసా నిధులను రిలీజ్ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎకరానికి 15వేల రూపాయల చొప్పున ఏడాది మొత్తంలో రైతుల ఖాతాలో జమ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో చెప్పింది. ఇప్పుడు ఆ డబ్బులను దసరా లోపు వెయ్యాలని అనుకుంటుంది. ప్రస్తుత లెక్కల ప్రకారం 1. 53 కోట్ల ఎకరాలకు 11475 కోట్లు ఖర్చు అవుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంచనా వేసింది. ఇక తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో ఈ డబ్బులు రిపీట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

## నేడు ప్రారంభంకానున్న కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ

**మొదటి పేజీ తరువాయి**

చేయనున్నట్లు తెలుస్తోంది. ఎన్‌డీఎస్ఏ, పూణే రిపోర్ట్ కోసం లేఖలు రాసిన కమిషన్, కమిషన్‌కు కావాల్సిన సమాచారం ఇస్తానని ఆయా టీమ్స్ చెప్పాయి. కమిషన్ అడిగిన లాయర్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. అఫిడవిట్ దాఖలు చేసిన ప్రతీ ఒక్కరినీ కమిషన్ బహిరంగ విచారణ చేయనుంది. ఇక ఇప్పటికే కమిషన్ విచారణ కార్యాలయానికి కమిషనర్ జస్టిస్ పీనాకి చంద్ర ఘోష్ చేరుకున్నారు. ఘోష్‌తో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ భేటీ అయ్యారు. నేటి నుంచి ఎవరిని విచారణ చేయాలి అనే అంశం, విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ రిపోర్టులపై చర్చించారు. ఇప్పటికే మొదలైన ఓపెన్ కోర్టు విచారణ. గత 20 నుంచి ఐదు రోజుల పాటు ఇరిగేషన్ అండ్ సీఈఓ అధికారులను జస్టిస్ గోష్ విచారించారు.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## అరవింద్ కేజ్రీవాల్ మాస్టర్ స్ట్రోక్...

అరవింద్ కేజ్రీవాల్ పాలిటిక్స్ ఆలోచనలకు అందవు. రాజకీయాల్లో మన తదుపరి అడుగును ప్రత్యర్థి ఊహించడానికి ఆస్కారం ఉంటుంది. కానీ, అరవింద్ కేజ్రీవాల్.. తన క్రేజీ డెసిషన్స్‌తో ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తాడు. ఢిల్లీలో 2013లో అధికారాన్ని చేపట్టాల్సిన బీజేపీని ప్రతిపక్షానికి పరిమితం చేసిన ఆమ్ ఆద్మీ ఈ అరవింద్ కేజ్రీవాల్. దశాబ్దకాలం కాచుక్కూచున్న బీజేపీకి.. ఈ సారి కూడా అధికారాన్ని అందని ద్రాక్ష చేసేలా నిర్ణయాన్ని ప్రకటించాడు. ఒక వైపు లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు, సుదీర్ఘ పాలన వల్ల సహజంగా ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకత, ప్రతిపక్ష బీజేపీ చేసే బలమైన ఆరోపణలు, మరో వైపు లిక్కర్ కేసు ఉచ్చు.. ఇలా అన్నీ రౌండప్ చేస్తున్న వేళ అరవింద్ కేజ్రీవాల్ నిజంగానే మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. ఈ స్ట్రోక్‌తో ప్రతిపక్షానికి మైండ్ బ్లాంక్ అయిందని చెప్పొచ్చు.బీజేపీకి ఇలా స్ట్రోక్‌లు ఇవ్వడం అరవింద్ కేజ్రీవాల్‌కు ఇది కొత్తకాదు. 2013 నుంచి బీజేపీని ముప్పుతిప్పలు పెడుతున్నాడు. అవినీతికి వ్యతిరేక పోరాటాన్ని తన రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధం చేసుకున్న అరవింద్ కేజ్రీవాల్.. నెత్తికి మఫ్లర్, కాళ్లకు స్లిప్పర్లు వేసుకుని, సాధారణమైన డ్రెస్సులో అంతే సామాన్యమైన వ్యవహారంతో ప్రజలకు చేరువయ్యాడు. తాను నిజంగానే ఆమ్ ఆద్మీని అన్ని విధాలా చాటిచెప్పాడు. ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించాడు.2013 వరకు 15 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో అప్రతిహతంగా అధికారాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై నెలకొన్న ప్రజా వ్యతిరేకతను సమర్థవంతంగా క్యాప్చర్ చేసే పనిలో బీజేపీ ఉన్నది. 2013లో తమకే అధికారమన్న ధీమాతో పని చేసింది. కానీ, ఇంతలో అరవింద్ కేజ్రీవాల్ సుడిగాలిలా అడ్డుతగిలాడు. తన పార్టీని విశ్వసించి అధికారాన్ని ఇవ్వాలని, బీజేపీతో, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోబోనని తన పిల్లలపై ఒట్టు పెట్టాడు. కాంగ్రెస్ ఘోరంగా తుడిచిపెట్టుకుపోగా.. ఢిల్లీలోని 70 సీట్లల్లో బీజేపీ 31 సీట్లు, ఆప్ 28 సీట్లు గెలుచుకుంది. హంగ్ తీర్పు రావడంతో బీజేపీ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటు పిలుపును నిరాకరించింది. మరోవైపు ఆప్ తన మార్క్ పాలిటిక్స్ కంటిన్యూ చేసింది. 30 డిమాండ్లను రిలీజ్ చేసింది. ఏడు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ పార్టీ ఆ డిమాండ్లను యాక్సెప్ట్ చేయడంతో అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టాడు.కానీ, 49 రోజులకే 2014 ఫిబ్రవరిలో సీఎంగా రిజైన్ చేశాడు. కాంగ్రెస్, బీజేపీలు వాటి అవినీతి విధానాలతో తమ పాలనలో అవాంతరాలు సృష్టిస్తున్నాయని ఆరోపించాడు. అప్పటికీ ఢిల్లీలో బీజేపీకి ఎక్కువ ఆదరణ ఉన్నదని, 2014లో తొలినాళ్లలోనే ఎన్నికలు జరిగి ఉంటే కచ్చితంగా బీజేపీ గెలిచేదనే అభిప్రాయాలు వచ్చాయి. ఈ క్రమంలో 2014 అక్టోబర్‌లో కేజ్రీవాల్ ఓ ట్వీట్ వదిలాడు. ఎన్నికలంటే బీజేపీ పరుగు పెడుతున్నదని, ఓడిపోతామనే భయం ఆ పార్టీని పట్టిపీడుస్తున్నదని కామెంట్ చేశాడు. ఆప్ ప్రతినిధులు ఈ వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఫలితంగా ప్రజల్లో బీజేపీ కంటే ఆప్ బలంగా ఉన్నదనే అభిప్రాయం వెళ్లింది. ప్రజల తీర్పును కాలరాసి రాజీనామా చేశాడని బీజేపీ ఆరోపణలకు పదునుపెట్టగా క్షమాపణలు చెబుతూ ప్రజల్లోకి వెళ్లాడు కేజ్రీవాల్. తనకు మరో అవకాశం ఇవ్వాలని వేడుకున్నాడు.అప్పుడు 70 సీట్లల్లో 67 సీట్లు ఇచ్చి ఆప్‌ను ప్రజలు గెలిపించారు. ఇక 2020 ఫిబ్రవరిలో కేజ్రీవాల్ మూడోసారి అధికారాన్ని(63 సీట్లతో) చేపట్టాడు. ఈ సారి ఆప్ పై లిక్కర్ కేసు వంటి తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అవినీతిపై పోరాటంతో పుట్టిన ఆప్ అవినీతి పార్టీ అనే ప్రచారాన్ని బీజేపీ బలంగా చేస్తున్నది. ఆమ్ ఆద్మీ అని చెప్పుకునే కేజ్రీవాల్.. ఢిల్లీలో విలాసవంతంగా నిర్మించిన భవంతిలో ఉంటున్నారని ఆరోపిస్తున్నది. అవినీతి కేసులో కేజ్రీవాల్ జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. తొలిసారి జైలుకెళ్లిన సీఎం ఈయనే. ఈ సారి తమ గెలుపును ఆపేవారే లేరని బీజేపీ ధీమాగా ఉన్నది. కానీ, అరవింద్ కేజ్రీవాల్ అంటే అంత సింపుల్ కాదు కదా!జార్ఖండ్‌లోనూ హేమంత్ సోరెన్ జైలుకు వెళ్లే పరిస్థితులు వచ్చినప్పుడు సీఎం పదవికి రాజీనామా చేశాడు. అరవింద్ కేజ్రీవాల్ కూడా అలాగే రాజీనామా చేస్తాడని బీజేపీ ఆశించింది. కానీ, అవసరమైతే జైలు నుంచే పాలన చేస్తానని, రాజీనామా చేసే ప్రసక్తే లేదని అరవింద్ కేజ్రీవాల్ తేల్చేశాడు. బీజేపీ ఎంత ఒత్తిడి తెచ్చినా తట్టుకుని రాజీనామా చేయలేదు. సుప్రీంకోర్టు తీర్పుతో బయటికి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్.. రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించి అందరి అంచనాలను తలకిందులు చేశాడు. తనపై అవినీతి కేసును ప్రజా కోర్టులో తేల్చుకుంటానని, ప్రజలు ఇచ్చే తీర్పు.. ఈ లిక్కర్ కేసు మరకను తుడిచివేస్తుందని చెప్పాడు. ఇది ప్రతిపక్షానికి దిమ్మదిరిగే షాక్. అరవింద్ కేజ్రీవాల్‌పై పొలిటికల్‌గా ఎలా దాడి చేయాలా? అనే ఆలోచనలో పడిపోయింది అపోజిషన్.ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవి నుంచి తప్పుకుంటాడు. ఒక ఎమ్మెల్యేగా ఈ కేసుపై పోరాడుతాడు. దీంతో రాహుల్, సోనియాపై బీజేపీ విరుచుకుపడినట్టుగా బెయిల్ సీఎం లాంటి పంచ్‌లు విసరలేదు. అధికారానికి పాకులాడుతాడనే ఆరోపణలూ చేయలేదు. సీఎం పదవికి రాజీనామా చేయడంతో ఆ విలాసవంతమైన భవంతిని కేజ్రీవాల్ వదిలి.. మళ్లీ తాను సాధారణ పౌరుడినే అనే నెరేటివ్ ప్రజల్లోకి ఈజీగా తీసుకెళ్లవచ్చు. కేజ్రీవాల్ సాధారణ ఎమ్మెల్యేగా మారి ప్రభుత్వం నుంచి డిస్టెన్స్ పెంచుకోవడం.. కొత్త ముఖం సీఎంగా రావడంతో అవినీతి ప్రభుత్వమనే అభిప్రాయాలు కనుమరుగు కావొచ్చు.సీఎంగా అతిషీని ఎంచుకోవడం కూడా అరవింద్ కేజ్రీవాల్ మాస్టర్ స్ట్రోకే. మహిళకు అగ్రపదవిని కట్టబెట్టడమే సాఫ్ట్ కార్నర్ సంపాదించడంతోపాటు చాలా పోర్ట్‌ఫోలియోలు నిర్వహించిన అనుభవమున్న అతిషి.. ప్రభుత్వ విజయాలను ప్రభావవంతంగా ప్రచారం చేయగలదు. ఆమె మహిళ కావడం మూలంగా బీజేపీ దూకుడుగా ఆరోపణలు చేయడం కష్టసాధ్యమే. అతిషి ప్రభుత్వ విజయాలను ప్రచారం చేస్తే.. బీజేపీని రాజకీయంగా కేజ్రీవాల్ ఎదుర్కోవచ్చు. ఎన్నో వనరులున్న బీజేపీకి ఈ సారి కూడా అరవింద్ కేజ్రీవాల్ అగ్నిపరీక్షే పెడుతున్నాడు. ఎన్నికల వరకు ఇంకా ఎన్ని పొలిటికల్ స్టంట్లు జరుగుతాయో చూడాల్సిందే మరి.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- 500 లకే సిలిండర్ ధృవీకరణ పత్రాలు అందజేత
- త్వరలో మరో రెండు కొత్త పథకాలు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కౌకుంట్ల మండలం కేంద్రంలోతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా 500 లకే గ్యాస్ సిలిండర్ పథకం కార్యక్రమనికి సంబంధించిన లబ్ధిదారులకు అధికారులు,స్థానిక నాయకులతో కలసి ధృవీకరణ పత్రాలు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు,గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన, గత ప్రభుత్వ విధ్వంసాన్ని చక్కదిద్దుకుంటూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు 5 వేల కోట్ల మిత్తి కట్టుకుంటూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందని కోరారు. అందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 వందల యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్, 10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ తదితర హామీలు నెరవేర్చామని తెలిపారు. 98 శాతం మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని, అక్కడక్కడ సాంకేతిక కారణాలతో రుణమాఫీ నిలిచిపోయిన రైతులకు, సమస్యను పరిష్కరించి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. మహిళల సాధికారత ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అందులో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్లను తీసుకు వచ్చామని, ఔత్సాహిక మహిళలు వ్యాపారం చేసుకునేందుకు శిల్పారామంలో ఉచితంగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని సూచించారు. స్కూల్ యూనిఫాంలో కుట్టే బాధ్యత, అమ్మ పాఠశాలలు పనులు సైతం మహిళా సంఘాల కేటాయించామని తెలిపారు. త్వరలో రెండు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విమర్శించడమే ధ్యేయంగా బిఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు.కేటీఆర్ కు రాజీవ్ గాంధీని విమర్శించే స్థాయి, అర్హత లేవని కోరారు.బిజెపి మెప్పు పొందడం కోసమే రాజీవ్ గాంధీ విగ్రహం తొలగిస్తామని బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు మాట్లాడుతున్నారన్నారు. మరోసరి రాజీవ్ గాంధీ గురించి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని కేటీఆర్ పై జియంఆర్ విరుచుకు పడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా పై అవగాహన కార్యక్రమం



ఆత్మకూరు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో ఓటర్ జాబితా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలం ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇటీవల నూతన ఓటర్ జాబితా ప్రతి గ్రామపంచాయతీలో అంటించడం జరిగిందని వాటిని పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21 వరకు తెలియజేయాలని తెలిపారు.అలాగే కొత్త ఓటర్లు ఎవరైనా ఉంటే నమోదు చేయించాలని ఆయన అన్నారు. ఓటర్ లో ఏమైనా సవరణలు ఉంటే ఫామ్-8 ద్వారా సవరణ చేసుకోవచ్చని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మండల తహసిల్దార్ రాజు,మండల అభివృద్ధి అధికారి సుజాత,మండల పంచాయతీ అధికారి శ్రీరామ్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు నాయకులు కార్యదర్శులు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నాంది

- బడుగు బలహీన వర్గాల రాజకీయ స్థానం కల్పించింది పార్టీ
- రాష్ట్ర నాయకుడు తుమ్మల ప్రసాద్
- ఎన్టిఆర్, చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేశారు
- జిల్లా నాయకులు పాల్వాయి రమేష్, ఇంజమూరి వెంకటయ్య



నేరేడుచర్ల, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలనే దృఢమైన ఆలోచన పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేయు సమయాన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇటీవలి పకృతి అకాల వర్షాల వల్ల జన జీవనశైలి అతలాకుతలం కాబడి వారి సహాయ సహకారాల పట్ల పార్టీ కార్యక్రమాలు నిలిచి పోయాయనీ కానీ చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్ర పార్టీ పట్ల కార్యకర్తల పట్ల మరవడమనేది అసాధ్యమని, తెలుగుదేశం పార్టీ తెలుగు బాష ఉన్నంత వరకు తెలుగు జాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటదనీ అసలు పార్టీ స్థాపితమే హైదరబాద్ నడిబొడ్డుననే విషయాన్ని పార్టీ పట్ల విమర్శ చేసే వారు గుర్తించాలని రాష్ట్ తెలంగాణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల ప్రసాద్ నేరేడుచర్లలో విలేకరుల సమావేశంలో తెలిపారు. పార్టీ ద్వారా పలు పదవులు, ఆర్థికాభివృద్ధి చెందిన వారే పార్టీని వీడడం బాధాకరమని నాలుగు దఫాలు పూర్తి కాబడి ఐదవ దఫా ప్రభుత్వాలు మారిననూ పార్టీ అధికారంలో లేకున్ననూ గ్రామ స్థాయిలో పార్టీ అభిమానులు నిజమైన కార్యకర్తలు ఉండడం వల్లనే అనీ పార్టీ ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు ఎంతగా మేలు చేయబడ్డాయనేది గుర్తు చేస్తుందని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీతో కలిసొచ్చే పార్టీలతో రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి ఉన్నదనీ రాబోయే ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షాలకే ప్రజలు మద్దతు ఇస్తారనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు. ఇట్టి సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పాల్వాయి రమేష్ మండల పార్టీ అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య పట్టణ పార్టీ అధ్యక్షుడు పొనుగోటి జంగారావు పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రైతులు చలో ప్రజాభవన్ నేపథ్యంలో అరెస్టు చేయడం హేయమైన చర్య

**- బిఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి**



ములుగు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): గురువారం ఉదయం నుంచి కూడా ములుగు నియోజకవర్గంలో అన్ని మండలాల నుండి అన్నదాతల ఇళ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకోవడం అరెస్టు చేసి స్టేషన్లో నిర్బంధించడం సరైనది పద్ధతి కాదు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ప్రభుత్వం ఇకనైనా ఆపాలి అని బిఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి అన్నారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో 2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీఇచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ మోసం చేసిందని కనీసం 40 శాతం రైతులకు కూడా రుణమాఫీ కాలేదు అన్నారు. రైతులు వారి సమస్యను శాంతియుతంగా తెలపడానికి ప్రజా భవన్ కు వెళ్తున్న సందర్భంగా రైతులను నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. రైతులు సంఘ విద్రోహశక్తులు కారని రెక్క కష్టం చేసి దేశానికి అన్నం పెట్టడమే వారికి తెలుసు అన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన యగుసం మట్టిలో కొట్టుకుపోతాయని రైతును ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బడే నాగజ్యోతి మండిపడ్డారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. జిల్లాలో ముందస్తు అరెస్టులకు గురైన రైతు కమిటీ నాయకులు ఎవరు కూడా అధైర్య పడకూడదని ములుగు జిల్లాలో రైతుల పక్షాన ప్రజల పక్షాన పోరాడడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు.

## మినీ ట్యాంక్ బండ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్





ములుగు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): మినీ ట్యాంక్ బండ్ ముందస్తుగా బతకమ్మ పండుగ సంబరాలు ఆడిబిడ్డలకు ముందస్తుగా సంబరాలు జరిపే స్థలాన్ని మరియు ట్యాంక్ బండ్ ను పర్యవేక్షించారు. ట్యాంక్ బండ్ యొక్క విస్తీర్ణాన్ని ఎమ్మార్వో విజయభాస్కర్ ద్వారా తెలుసుకున్నారు ట్యాంక్ బండు అక్రమకు గురి కాకుండా చూడాలని అన్నారు. ముంధస్తు ఆడిబిడ్డలకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## క్రీడాకారులు తమ ధృవీకరణ పత్రాల సమాచారం ఇవ్వాలి



జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు తెలంగాణ క్రీడాపాలసీ ద్వారా సహకారం అందించేందుకు సమాచారం సేకరిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి చిర్ర రఘు ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తమ వివరాలను పొందుపరిచి, క్రీడల సర్టిఫికెట్స్ 2 పాస్ ఫొటోలను జతచేసి ఈనెల 23లోగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ కార్యాలయం రూం నో. %ఖీ-25/ూ%, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయములో అందజేయాలని కోరారు. ఇట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోరారు.

## ఉచిత మెగావైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



గణపురం, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో గురువారం ప్రతిమ రిలీఫ్ హాస్పిటల్ మరియు అమృత వర్షిణి ఫౌండేషన్ - భూపాలపల్లి వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత హెల్త్ క్యాంప్ లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు ముందుకొచ్చి పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

హైదరాబాద్: తన పిల్లలను పాఠశాలలో వదిలి ఇంటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదం లో ఓ మహిళ మృతి చెందింది. అంబర్పేట్ కు చెందిన నీత తన పిల్లలు నాచారం లోని జాన్సన్ స్కూల్ పాఠశాలలో వదలడానికి ఉదయం తన స్కూటి పై ఇంటికి బయలు దేరింది. నాచారం లోని హెచ్ఎంటి నగర్ వద్ద గ్యాస్ సిలిండర్ల తో వస్తున్న లారీ స్కూటిని ఢీకొట్టడంతో మహిళ లారి చక్రాల క్రింద పడి అక్కడిక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లారి డ్రైవర్ నిర్లక్ష్యం తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. స్కూల్ బస్సు రాకపోవడం తో తను పిల్లలను స్కూల్ లో దింపడానికి వచ్చిందని మృతురాలి బంధువులు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ




నేరేడుచర్ల, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. దాత రాపోల్ నవీన్ కుమార్ ఆర్థిక సహాయముతో విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పెన్సిల్లు అందించడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి మరియు కాంప్లెక్స్ హెడ్మాస్టరు బట్టు మధు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవే మార్గంగా సేవే లక్ష్యంగా నిరుపేదలకు అనాధలకు అండగా ఉంటుందని భావితరాలకు విద్యార్థులు తొలిమెట్లని, పట్టుదలతో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలని తల్లిదండ్రులు కన్నకలలను నిజం చేయాలని ప్రతిభతో అంతర్జాతీయ వేదికలనధిరోహించాలి నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే అందుతుందని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను భక్తిశ్రద్ధలతో నేర్చుకొని విద్యార్థులు మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు కర్రీ సూర్యనారాయణ రెడ్డి ఎంజెఎఫ్ లయన్ సభ్యులు కట్ట శ్రీనివాస్ రెడ్డి మాజీ అధ్యక్షులు కందిబండ శ్రీనివాస్ సభ్యులు ఎం సైదులు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ సామాజిక కార్యకర్తలు తక్కెళ్ళ నాగార్జున కర్రి సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

# టిపిటిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్స్ కి సన్మానం



నేరేడుచర్ల, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టి పి టి ఎల్ ఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించి, ప్రత్యేక సన్మానం కార్యక్రమం జరిగినది. స్థానిక శ్రీ అంజలి పాఠశాలలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో టిపిటిఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ జె.నర్సిహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ గౌరవ సన్మానం చేయడం జరిగింది. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఉపాధ్యాయ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, వారికి గుర్తింపు కార్డులు అందించాలని టి పి టి ఎల్ ఎఫ్ జిల్లా కన్వీనర్ జె. నరసింహారావు డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేలా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి దమాడ్ చేసారు.ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి మద్దతు అవసరమని, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడతామని ఈ కార్యక్రమంలో అంజలి స్కూల్ ప్రిన్సిపల్ సైదిరెడ్డి ఉపాధ్యాయులు జానకి రాములు నాగ నాగమణి,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# దళితుడు లింగన్న కుటుంబాన్ని ఆదుకోవాలి

- లింగన్న పై అధికారులు వేధింపులు ఆపాలి
- దళిత సంఘాల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా



ఆత్మకూర్, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన దళితుడు లింగన్న కుటుంబాన్ని ఆదుకోవాలని లింగన్న నివాసం ఉంటున్న ఇంటి నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ వేధింపులు ఆపాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుముల సోంబాబు ఎంఆర్పిఎస్ నాయకులు మాసన్న జానకి రాములు కెవిపిఎస్ జిల్లా నాయకులు అజయ్ డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు రవీందర్ సిపిఐ మండల కార్యదర్శి రాబట్ సిపిఐ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ప్రసాద్ సిపిఎం మండల నాయకులు ఎస్ రాజు ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ హెూలీయ దాసరి కుటుంబానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన లింగన్న ఆత్మకూరులోని సంజయ్ కాలనీ



పరిమిల కాలనీ సరిహద్దుల్లో గత 40 సంవత్సరాల క్రితం నుండి గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు ఈ పరిస్థితుల్లో గత సంవత్సరం కాలం నుండి మున్సిపల్ కమిషనర్ తాసిల్దార్ ప్రైవేట్ వ్యక్తుల ధనవంతుల ఆస్తులను కాపాడడానికి అండగా ఉంటూ నివాస స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తూ మున్సిపల్ సిబ్బందితో నివాసముంటున్న గుడిసెను తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ఆపాలని దళిత కుటుంబాన్ని వేధింపుల నుండి రక్షించాలని దళితుడైన లింగన్నకు అదే అదే స్థలంలో అనుమతులు ఇచ్చి ఇంటి నిర్మాణం చేసుకొనుటకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వారి డిమాండ్ చేశారు. లింగన్నను అలానే వేధిస్తే దళిత సంఘాల కుల సంఘాల వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో లింగన్న కుటుంబానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని లింగన్నకు న్యాయం జరిగే వరకూ ముందుంటామని వారు అన్నారు తాసిల్దార్ కమిషనర్ సహకరించి ఆ స్థలానికి లింగన్నకు అన్ని హక్కులు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక డిప్యూటీ తాసిల్దార్ కు మరియు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

# పిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు



దేవరకద్ర, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): నూతన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్ లోని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నివాసంలో మదనాపురం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాలని నాయకులు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కోరగా, కష్ట పడిన వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మండల పార్టీ అధ్యక్షులు గజ్జల నాగన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ,కొన్నూర్ మాజీ ఎంపిటిసి శరత్ రెడ్డి, దంతనూర్ గ్రామ అధ్యక్షులు ఉప్పరి వెంకటన్న, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిబాబా, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీ

వైద్యుల గైర్హాజరుపై ఆగ్రహం
సమయ పాలన పాటించాలని ఆదేశం

కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖానలో సూపరిన్టెండెంట్, డాక్టర్లు డ్యూటీకి రాలేదని గుర్తించిన మంత్రి జూపల్లి, వారి గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షో కాజ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణ తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి (ఆఓఊా) డాక్టర్ స్వరాజ్యలక్ష్మిని మంత్రి ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుంటే వైద్యులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సందర్భంగా పలువురు పేషెంట్లతో మంత్రి జూపల్లి మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లు, నర్సులు సరియైన సమయానికి రావటం లేదని, తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని మంత్రికి వివరించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ.. రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందజేసే బాధ్యత మనపై ఉందని డాక్టర్లు, నర్సులతో అన్నారు. అనంతరం దవాఖానలోని పలు విభాగాలను పరిశీలించారు. దవాఖానకు వస్తున్న పేషెంట్లు వివిధ విభాగాలను తెలిగ్గా గుర్తించేలా సైన్‌బోర్డులు పెట్టాలని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. త్వరలో ఆసుపత్రి అభివృద్ధిపై కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 25 లక్షలు కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# 2024-25 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): 2024-25 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ తన చాంబర్ లో జిల్లా రెవెన్యూ కలెక్టర్ సిహెచ్ మహేందర్ జితో కలిసి రైస్ మిల్లర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రాగునీరు, టార్పాలీన్, గన్ని బ్యాగులు, విన్నింగ్ యంత్రాలు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కొనుగోలు కేంద్రంలో తప్పనిసరిగా ఎలక్ట్రిక్ తూకాన్ని మాత్రమే వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ధాన్యం నిలువ చేయడానికి అనుకూలంగా ఉంటే గోదాం స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఎంచుకోవాలని సూచించారు. రైతుల సొమ్ము దుర్వినియోగం కాకుండా రైతులకు అందించే ట్రక్ షిట్ జారీ చేసే విషయంలో జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే అమ్మే విధంగా ధాన్యాన్ని అమ్మే విధంగా తగు సూచనలతో కూడిన కరపత్రాలను, ఫ్లెక్సీలను, గ్రామాలలో ఏర్పాటు చేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ సమావేశంలో డి సి ఎస్ ఓ హైజార్ ఉస్సెన్ సివిల్ సప్లై అధికారి బి రాంపతి, డిసిఓ సర్దార్ సింగ్, జిసిసి మేనేజర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు**



మంగపేట, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రం లోని వైస్సార్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యములో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు యంగ్ డైనమిక్ లీడర్ పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి జిల్లా మండల నాయకులు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టసుఖాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ మంత్రి సీతక్క వెంట నడుస్తూ కాంగ్రెస్ పార్టీకి పేద ప్రజలకు సేవ చేస్తున్న మనసున్న



నాయకుడు పైడాకుల అశోక్ ని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పుట్టినరోజు సందర్భంగా ములుగు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులతో మండలంలోని కస్తూరిబా వృద్ధాశ్రమానికి వెళ్లి క్వింటా బియ్యం మరియు పండ్లను వృద్ధులకు పంపిణీ చేయడం జరిగింది అదేవిధంగా ప్రభుత్వహాస్పిటల్ కి వెళ్లి అనారోగ్యం తో ఉన్నవారిని పరామర్శించి వారికీ పండ్లు, బ్రేడ్స్ పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కోడం రమక్క సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంగపేట, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండల రమణక్కపేట గ్రామానికి చెందిన జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి రమణక్కపేట సింగిల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ అమ్మగారు రమక్క సంవత్సరిక కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వల్లిపల్లి శివప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సోమయ్య , జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి అయోరి యణయ్య, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, జిల్లా కార్యదర్శి తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటబోయిన నరసింహారావు, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి తుమ్మూరి రామ్ రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, సీతక్క యువసేన మండల అధ్యక్షులు సిద్దబత్తుల జగదీశ్, మండల ఉపాధ్యక్షులు గాదే శ్రావణ్ కుమార్, మండల సీనియర్ నాయకులు కొమరం అబ్బయ్య, పొట్రూ సమ్మయ్య, పరమేష్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు నివారణకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలి

**- గ్రామాల్లో షానిటేషన్, పరిశుభ్రత డ్రైడేను పాటించాలి**
**- వసతి గృహాలు తనిఖీలు నిర్వహించాలి**
**- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): గురువారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్స్ సంబంధిత అధికారులతో సీజనల్ వ్యాధులు, సానిటేషన్, వసతి గృహాల తనిఖీ, సామ్, మామ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు రాకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని, అవసరం అయిన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్స్, ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామాలు మున్సిపల్ లోపరిధిలో ప్రతిరోజు పక్కాగా షెడ్యూల్ ప్రకారం సానిటేషన్ నిర్వహించాలని, డ్రైడేలను పాటించాలన్నారు, డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయాలని ఫాగింగ్ చేపించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలను ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్, వసతి గృహాల ఇన్చార్జులు, క్రమం తప్పకుండా విజిట్ చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజనం తదితర సౌకర్యాలను తనిఖీ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా సూపర్వైజరి సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం, ద్వారా సామ్, మామ్ లలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది కలసి పోషక ఆహారం లోపం కలిగిన సామ్, నుండి మామ్ కు తీసుకు రావడానికి సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ అన్ని విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) లెనిన్ వత్సల్ టోప్పో జిల్లా పరిషత్ సీఈఓ నర్మదా, డిపిఓ హరిప్రసాద్, వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్, అన్ని విభాగాల సంక్షేమ హాస్టల్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

గీసుగొండ, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): గురువారం గీసుగొండ మండలం వంచనగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, డిజిటల్ క్లాస్ రూం లను పరిశీలించారు. తరగతి గదులు సందర్శించి, విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిల ఆరోగ్యం,





ఆహారం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థినిలు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు అవసరమాకు మౌలిక సదుపాల ఏర్పాటుకు తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అవసరమైన నిధులు తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. పిల్లలకి నాణ్యమైన విద్య తో పాటు పౌష్టిక ఆహారం అందించే విషయంలో రాజీ పడవద్దని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. గురుకుల పాఠశాలాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలి అన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన పిల్లల ఆహార నియమాల పట్టిక (మెను) అందించాలని అన్నారు. పాఠశాల ఆవరణలో ప్లే గ్రౌండ్ నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని, బాలికల రక్షణ కోసం ప్రహరీ గోడ చేపట్టాలని, పైప్లైన్ లీకేజీ ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఏస్ డి ఎఫ్ నిధుల ద్వారా బెడ్స్ సౌకర్యం కల్పిస్తానని, పాఠశాలలో అన్ని వసతులు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కళాశాల ప్రాంగణం,భోజన ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని,తద్వారా విద్యార్థులను అనారోగ్య బారిన పడకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, ఇతర వంట సామాగ్రి పై నాణ్యత తో కూడిన సరకులను ఉపయోగించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ తేది, నాణ్యత తప్పనిసరిగా చూసుకోవాలని, టెండర్లు ఏ వస్తువులను కోడ్ చేశారో అట్టి వస్తువులు మాత్రమే తీసుకావాలని, నాణ్యత లేని వస్తువులు ఉపయోగించరాదన్నారు.



# ఓటరు జాబితాలో మీ పేరు పరిశీలించుకోనుటకు సూచన

## – ప్రత్యేక అధికారి బోయపాటి చెన్నయ్య

ములుగు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా ములుగు జిల్లాను (అన్ని జిల్లాలలో) సందర్శించనున్న ఎన్నికల సంఘం అధికారులు. ప్రతి బూత్ స్థాయి అధికారి ఇంటింటి సర్వే రికార్డులతో పరిశీలన కొరకు అందుబాటులో ఉండాలని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 2024 నుండి ప్రారంభమైన ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి బూత్ స్థాయి అధికారి ప్రతి ఒక్క ఓటర్ ఇంటికి వెళ్లి వారి వివరాలను సరి చూసి ఓటరు జాబితాను స్పెషల్ సమ్మర్ రివిజన్ 2025 లో భాగంగా సరి చూడాలని 01.01.2025 నాటికి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయాలని,(01.04.2025,01.07.2025 మరియు 01.10.2025 నాటికి 18 సంవత్సరాల నిండే ప్రతి ఒక్కరి నుండి %ూా=% 2025 సమయంలో ఓటర్లుగా నమోదు చేసుకొనుటకు అడ్వాన్స్ అప్లికేషన్ తీసుకోవాలని , ఇంటిలోని కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలాగా చూడాలని మరియు షిఫ్టెడ్ జాబితాను/ డబల్ గా నమోదైన ఓటర్లను/ మరణించిన ఓటర్ జాబితాను తయారుచేసి వారిని ఓటర్ జాబితా నుంచి తొలగించాలని,పైన పేర్కొన్నవి భారత ఎన్నికల సంఘం తెలిపిన నిబంధనల మేరకు



నడుచుకోవాలని ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ ప్రత్యేక అధికారి శ్రీ బోయపాటి చెన్నయ్య ఆదేశించడం జరిగినది. కావున బూత్ స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ శ్రద్ధగా నిర్లక్ష్యం వహించకుండా వారి యొక్క విధులను సక్రమంగా నిర్వహించి, నిర్దిష్ట గడువులోపు ఇంటింటి సర్వే పూర్తి చేసి ఎలాంటి తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనలో పాలుపంచుకోవాలని కోరనైనది.

# అంగన్వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): అంగన్వాడి కేంద్రాలలోనే బాల్యం బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడి ఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారు లు, టీఎస్ డబ్లుఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. సాక్ష్యం అంగన్వాడి పథకం ద్వారా 50 అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని, అట్టి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నవీకరణకు నిధులు మంజూరు చేయడం జరిగిందని నవీకరణలో భాగంగా మరుగు దొడ్లు నిర్మాణం, త్రాగునీరు సౌకర్యం, పెయింటింగ్ పనులు, పండ్లు కూరగాయల తోటలు పెంపకం లాంటి మౌలిక సదుపాయాలు కల్పన



పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని టీఎస్ డబ్లుఐడిసి అధికారులను ఆదేశించారు. చిన్న పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, సీడీపీవోలు అవంతి,రాధిక, టీఎస్ డబ్లుఐడిసి ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2,050 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఆరోగ్య శాఖలో 2,050 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి వైద్యారోగ్య సేవల నియామక మండలి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఈ నోటిఫికేషన్ ద్వారా డీహెచ్, డీఎంఇ, కుటుంబ సంక్షేమ విభాగంలో 1,576, టీవీవీపీలో 332, ఆయుష్‌లో 61, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 80, ఐపీఎంలో ఒక పోస్టును భర్తీ చేయనున్నారు. ఈ ఖాళీల్లో మార్పులు ఉండొచ్చనీ, ఖాళీలు పెరిగితే వాటిని జోడించడం, తగ్గించడం చేయొచ్చని ఆ ప్రకటన లో స్పష్టం చేశారు. అర్హులైన వారు ఈ పోస్టుల కోసం అక్టోబర్ 10 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 16న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎడిట్‌కు అవకాశమిచ్చారు. నవంబర్ 17న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

### టీఎన్ఏ హర్షం

నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల పట్ల తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ (టీఎన్ఏ) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపింది.

# జిల్లాలో రైతు నాయకుల అక్రమ అరెస్టులు తగదు





## – ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య

ములుగు, సెప్టెంబర్ 19 (తీన్మార్ న్యూస్): రుణమాఫీ అమలుకాని రైతులు పోరుబాట పట్టారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్న డిమాండ్‌తో రైతులు నేడు చలో ప్రజాభవన్ పిలుపు మేరకు రైతులకు తన మద్దతు ఇచ్చేందుకు వెళుతున్నామన్న ముందస్తు సమాచారంతో తాడువాయిలో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్యని మరియు ములుగులో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య రైతు నాయకుడు జీవన్ రెడ్డి లను మరియు రైతులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వందశాతం రుణమాఫీ చేస్తామని సగం మందికి కూడా మాఫీ చేయకుండా రైతులను మోసం చేశాడన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు నేడు ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా అక్కడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం దారుణం అన్నారు. కాంగ్రెస్ హయాం లో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా అణచివేస్తున్నదని ఆరోపించారు. ఆరుగ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని పేర్కొన్నారు.

# పెన్షనర్ల ఆశలన్నీ క్యాబినెట్ పైనే..!

## టీ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల :ఈనెల 20న జరిగే క్యాబినేట్ మీటింగ్ పైనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలో అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.దసరా ముందు డీఏలు, పీఆర్సీ, పెండింగ్ సమస్యలపై తీపి కబురు చెప్తారని ఎదురుచూపులు చూస్తున్నామని, ఎంతోకాలంగా డీఏ (కరువు భత్యం), పీఆర్సీ (పే రివిజన్ కమిషన్), ఇతర సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. మొత్తం ఐదు డీఏలు, రెండో పీఆర్సీ నివేదిక తోపాటు ప్రత్యేక ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 తర్వాత ఉద్యోగులకు డీఏలు ప్రకటిస్తారని అంతా భావించామని,ప్రభుత్వం కూడా రైతు రుణ మాఫీ పూర్తైన వెంటనే ఉద్యోగులు,ఉపాధ్యాయులకు ,పెన్షనర్లకు సంబంధించిన డీఏలను ప్రకటిస్తామని ప్రకటించింది. కానీ రైతు రుణ మాఫీ తర్వాత ప్రభుత్వం ఎలాంటి ప్రకటన లేదు. దసరా, దీపావళి పండుగల దృష్ట్యా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తమ టి.పి.సీ.ఏ. రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో ఈ నెల 13 న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లకు వినతిపత్రం సమర్పించామన్నారు. దీంతో ఈనెల 20న జరిగే క్యాబినెట్ సమావేశంలోనా పెండింగ్ డి.ఏ.ల విడుదల, పీ ఆర్.సీ. ఫిట్మెంట్ , నగదు రహిత వైద్య సౌకర్యాల పై ,తదితర ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వం ను కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో పెన్షనర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు పి.హన్మంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు,ఎం.డి.యాకూబ్,నాయకులు పబ్బా శివానందం, విఠల్, సత్యనారాయణ, దేవేందర్ రావు,నారాయణ,మధుసూదన్ రావ్, ప్రసాద్,మురళీధర్,కరుణ,విజయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# భారతీయుల్లో 60 శాతం మందిలో క్యాన్సర్ టెన్షన్..

భారతదేశంలో అత్యంత భయంకరమైన వ్యాధులలో క్యాన్సర్ ఒకటిగా మారింది. ఈ పేరు వింటేనే జనం భయపడుతున్నారు. మన దేశం క్యాన్సర్ భయంతో అనేక రకాలుగా స్తంభించిపోతోంది.

క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాటంలో మనకు ముఖ్యమైన అడ్డంకి భయం.

ఇటీవలి %+ూఱఅఱ% సర్వేలో దాదాపు 60% మంది భారతీయులు క్యాన్సర్ గురించి నిరంతరం ఆందోళన చెందుతున్నారని వెల్లడించింది. ఇది కేవలం భావోద్వేగ సమస్య కాదుబీ ఇది ప్రజల జీవనశైలి ఎంపికలు, మానసిక ఆరోగ్యం , మూల్యాంకనం చేయడానికి ఇష్టపడే వాటిని కూడా ప్రభావితం చేస్తుంది.

క్యాన్సర్ ఆందోళనలు భారతదేశాన్ని ఎలా నాశనం చేస్తున్నాయి

చాలా మంది భారతీయులు క్యాన్సర్ భయంతో బాధపడుతున్నారని సర్వే వెల్లడించింది. ఈ నిరంతర, ఎప్పుడూ ఉండే భయం అన్ని వయసుల, లింగాల. సామాజిక ఆర్థిక నేపథ్యాల ప్రజలను ప్రభావితం చేస్తుంది. ప్రజలు క్యాన్సర్‌కు భయపడతారు . దానితో వచ్చే మరణం, ఆర్థిక ఇబ్బందులు , జీవనశైలి మార్పుల గురించి ఎక్కువగా భయపడతారు. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 24% మంది క్యాన్సర్‌తో చనిపోతామనే భయాన్ని వ్యక్తం చేశారు. మరో 33% మంది తమ కుటుంబానికి చికిత్స ఖర్చుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

భయం మన మానసిక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

అన్ని వేళలా భయపడుతూ ఉండటం మానసిక అలసటకు కారణమవుతుంది. క్యాన్సర్ ముప్పు ఫలితంగా చాలా మంది తీవ్ర ఆందోళన , ఒత్తిడిని అనుభవిస్తారు. ఇది నిరాశ, విచారం, ఏకాగ్రత కష్టం , నిద్రలేమి వంటి ఇతర సమస్యలుగా వ్యక్తమవుతుంది. వ్యాధుల భయంతో సాధారణ జీవితం గడపడం కష్టం. ఇది వారి సంబంధాలు,



పని సాధారణ మానసిక ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది.

అవగాహన కల్పించినా నివారణ చర్యలు లేవు

సర్వేలో పాల్గొన్న వారిలో 70% మంది క్యాన్సర్ గురించి తెలిసినప్పటికీ, గత ఐదేళ్లలో తమకు ఎలాంటి స్క్రీనింగ్ రాలేదని చెప్పారు. సమర్థవంతమైన చికిత్స కోసం ముందస్తుగా గుర్తించడం ఎంతో ముఖ్యం. ప్రజలు తమ శరీరాలను పరీక్షించుకోవడానికి వెనుకాడడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా ఆరోగ్య వ్యవస్థపై అపనమ్మకం , ఏదైనా వ్యాధులకు సంబంధించిన వార్తలు వినడానికి భయం చాలామందిలో నెలకొంది.

భారతదేశంలో క్యాన్సర్ చికిత్స ఖర్చు చాలా ఎక్కువ. చాలా కుటుంబాలు భరించలేని స్థితిలో ఉన్నాయి. చాలా మందికి, వైద్య సంరక్షణ, శస్త్రచికిత్స, కీమోథెరపీ , ప్రిస్క్రిప్షన్ మందుల ఖర్చులు భరించలేనంతగా ఉన్నాయి. ఈ సర్వేలో, 33% మంది పాల్గొనేవారిలో క్యాన్సర్ నిర్ధారణను అనుసరించే ఖర్చులు అనేవి ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.

# గాడ్సే వారసుల చేతుల్లో భారత్

హన్మకొండ చౌరస్తా: హన్మకొండ చౌరస్తా: బీజేపీ నాయకులు తీవ్రవాదుల్లా మాట్లాడుతున్నారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం రాహుల్ గాంధీదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా హన్మకొండ జిల్లా అంబేద్కర్ సెంటర్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. గాడ్సే వారసులు దేశాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని లెక్కచేయకుండా తీవ్రవాదుల్లా బీజేపీ నాయకులు మాట్లాడుతుంటే ప్రధాని మోడీ, మంత్రి అమిత్ షా.. చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆషామాషీ వ్యక్తి కాదని, ప్రధాని కావాల్సిన వ్యక్తిని పట్టుకొని.. నాలుక కోస్తా అనడమే కాక, టెర్రరిస్టుగా ముద్రవేయడం దారుణమన్నారు. ఆనాడు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వాళ్ళ సొంత ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాల కోసం ప్రాణాలు త్యాగం చేయలేదని, టెర్రరిస్టులను అదుపుచేసే క్రమంలో తమ ప్రాణాలనే పణంగా పెట్టారని గుర్తు చేశారు. మోడీ ఏ రోజైన దేశం కోసం జైలుకు వెళ్లిన దాఖలాలున్నాయా అని ప్రశ్నించారు. దేశంలో రాహుల్‌కి వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక బీజేపీ ఇలాంటి కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా గాంధీని



అవమానిం చడమే కాక, రాహుల్ గాంధీని ఇందిరాగాంధీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని అన్నారు. బీజేపీ ఎంపీలు ఉగ్రవాదుల్లా మాట్లాడుతుంటే ప్రధాని మోడీ, హొంమంత్రి అమిత్ షా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీజేపీ ఎంపీలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాహుల్ గాంధీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు రహీమున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రత్యేక అధికారులు కీలకం

జయశంకర్ భూపాలపల్లి: గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు చాలా ముఖ్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాటారం మండల పరిషత్ కార్యాలయంలో కాటారం డివిజన్ గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసినందున పారిశుధ్య కార్యక్రమాలు చాలా ముఖ్యమని మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు తనిఖీలు చేస్తూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను పర్యవేక్షణ చేయటం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రత్యేక అధికారులు పర్యటనలో గుర్తించిన అంశాలను పరిశీలించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, సబ్ సెంటర్స్, రెసిడెన్సియల్ హాస్టల్స్, గ్రామపంచాయతీ భవనాలు, ప్లాంటేషన్ కంపోస్ట్ షెడ్లు, వైకుంఠధామాలు తనిఖీ చేయాలని, తనిఖీ ఫోటోలను గ్రూపులో పోస్ట్ చేయాలని తెలిపారు. మన గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని అదే మన గోల్ అని తెలిపారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయటం వల్ల గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకుని వ్యాధులు దరిచేరని సమాజం ఏర్పడుతుందని అన్నారు. గ్రామాలు స్వచ్ఛతకు జరుగుతున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రహదారులు వెంబటి వ్యర్థాలు తొలగించాలని అక్కడ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని అపవాదులు రావొద్దని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమంలో మీరు భాగస్వాములుగా ఉన్నారని, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ అధికారాలను, విధులను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఆరుబయట వ్యర్థాలు కాల్చితే చర్యలు తీసుకోవాలని, కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కాల్చితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం 25 వేల వరకు జరిమానా విధించడానికి అవకాశం ఉందని తెలిపారు. భగీరథ నీటి సరఫరా పర్యవేక్షణ చేయాలన్నారు. మంచినీటి సమస్య ఏర్పడితే తన దృష్టి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. వేసవిలో చేపట్టిన చర్యల వల్ల గ్రామాల్లో సమస్యలు రాకుండా చేశామని, భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ యొక్క సమావేశం ముఖ్య విధి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన పేర్కొన్నారు. విధులు అధికారాలు గురించి చట్టం గురించి తెలుసుకోవాలని గ్రామ పంచాయితీలో పర్యటించడం వలన గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకుంటాయని పేర్కొన్నారు. ప్రతి వారంలో రెండు లేదా మూడుసార్లు తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో విదులు అధికారాలపై సమగ్రమైన, స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. వ్యాపార, మాంసాహార వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అమ్మపేరున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. వనరుల ద్వారా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతి కార్మికులను శాలువాతో సత్కరించి సేవలను అభినందించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యను అందించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి: విద్యార్థులకు మెరుగైన విద్య నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మహా ముత్తారం మండలంలోని మోడల్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం, కూరలను పరిశీలించారు. ఆకుకూర పప్పు, గుడ్డు వడ్డిస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నిర్వహించనున్న ఈ కళాశాలలో 302 మంది నుండి 9 వరకు, 97 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. 272 విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలుపగా గైర్హాజరు చాలా మంది ఉన్నారని ఏదేని ఆరోగ్య సమస్యలున్నాయా అడిగి తెలుసుకున్నారు. భూపాలపల్లి నుంచి విద్యార్థులు వస్తుంటారని బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తరచూ గైర్హాజరు అవుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని చాలా రోజులు నుండి పెండింగులో ఉన్నాయని తెలుపగా డీఈవోతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ అహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మతం మారాలంటూ ఒత్తిళ్లకు గురిచేయడం దారుణం

- ఇంతవరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గం
- రాష్ట్రము లో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకు మరింత దిగజారుతున్నాయి
- ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేసు విచారణను జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి డిమాండ్



హైదరాబాద్ సెప్టెంబర్ 19: టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ యువతి (అసిస్టెంట్ కొరియోగరాఫర్)పై డ్యాన్స్ కొరియోగ్రాఫర్ షేక్ జానీ బాషా ( జానీ మాస్టర్ ) లైంగిక వేధింపుల ఘటనను తీవ్రమైన చర్యగా భావిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఓ యువతిని ఐదేళ్ల పాటు నరకం చూపించడంతో పాటు, వేధింపులు, దాడులకు పాల్పడటం, మతం మారాలంటూ ఒత్తిళ్లకు గురిచేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.. ఇది లవ్ జిహాద్ కేసు. హిందూ అమ్మాయిని ట్రాప్ చేసినట్లు స్పష్టంగా ఎఫ్ఐఆర్ లో నమోదు చేసినప్పటికీ కేసును నీరుగార్చేందుకు నిందితుడిపై పనికిరాని కేసులు పెట్టడం ఏంటి..? ఇంతవరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గం. ఈ ఘటనకు కొందరు సినీ ఇండస్ట్రీ పెద్దలతో పాటు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలపై అత్యాచారాలు, హిందూ మహిళలను మతం మార్చి లైంగికంగా వేధించే ఘటనలు తీవ్రమైనా.. రాష్ట్ర ప్రభుత్వం చీమకుట్టినట్లు కూడా వ్యవహరించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. దీనికి హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా హోంశాఖపై ఒక్కసారి కూడా సమీక్షించలేకపోవడంతో శాంతి భద్రతల పరిస్థితి మరింత దిగజారిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఘటనలను తేలికగా తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ పై వేధింపులకు, లవ్ జిహాదీ చర్యలకు పాల్పడిన షేక్ జానీపై గతంలోనూ నేరచరిత్ర ఉందని, 2015లో ఓ కాలేజీలో మహిళపై దాడి కేసులో 2019లో మేడ్చల్ కోర్టు ఆరునెలల పాటు జైలుశిక్ష విధించినట్లు స్వయంగా పోలీసులే వెల్లడించారు. తాజాగా మరోసారి మహిళా డ్యాన్సర్ పై, మైనర్ గా ఉన్నప్పటి నుంచీ వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఈ కేసును చులకనగా తీసుకోవడాన్ని బిజెపి మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇటువంటి చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాగం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఈ కేసును విచారణను జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి, చట్టపరంగా పారదర్శకంగా విచారణను జరిపించేలా చర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని శిల్పా రెడ్డి హెచ్చరించారు .

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్..!

## టికెట్ బుకింగ్, ట్రాకింగ్ కోసం త్వరలో సూపర్ యాప్

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 19: రైల్వే అన్నిరకాల సేవలు అందించేందుకు సరికొత్త సూపర్ యాప్‌ను కేంద్రం తీసుకువస్తుంది. ఇందులో అన్ని రైల్వేసేవలు అందుబాటులోకి రానున్నాయి. రైలు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా సరికొత్తగా సూపర్ యాప్‌ని రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గతంలో ప్రకటించాయి. ఇందులోని అన్ని సేవలు ఈ యాప్‌లో ఉంటాయని చెప్పారురైలులో ప్రయాణానికి తప్పనిసరిగా టికెట్ కావాల్సిందే. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీకి ఉపయోగిస్తున్నారు. అయితే, రైల్వే ప్రయాణికులకు కోసం పలు రకాల యాప్స్‌ను ఉపయోగిస్తున్నది.. రైలు టికెట్ బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్‌సైట్‌ని ఉపయోగిస్తున్నారు. అలాగే, రైలు స్టేటస్‌ని ట్రాక్ చేసేందుకు, పీఎన్‌ఆర్ స్టేటస్‌ని చూసేందుకు వివిధ రకాల యాప్‌ని ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రైల్వేశాఖకు సంబంధించి టికెట్స్ బుకింగ్, పీఎన్‌ఆర్ స్టేటస్, ట్రాకింగ్ స్టేటస్ కోసం యాప్స్‌ని ఉపయోగించడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త సూపర్ యాప్‌ని తీసుకురాబోతున్నది. ఇకపై ఈ యాప్‌లోనే టికెట్స్ బుకింగ్, పీఎన్‌ఆర్ స్టేటస్, ట్రెయిన్ ట్రాకింగ్ చేసేందుకు వీలుంటుంది. అయితే, రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఇటీవల రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. గత దశాబ్దల కాలంగా రైల్వేలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. అలాగే, సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక ప్లాట్‌ఫారమ్ నుంచి జనరల్ టికెట్ వరకు ఆన్‌లైన్ మోడ్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. అదే సమయంలో రైల్వే భద్రతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారిస్తోంది. దీంతో రైలు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని మంత్రి చెప్పారు. ప్రభుత్వం స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (యఖ) వ్యవస్థను అమలు చేస్తున్నది. దీన్ని 'కవచ్'గా పిలుస్తుంటారు. ప్రస్తుతం 10వేలు కవచ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసింది రైల్వేశాఖ.

# ఎస్సీ, ఎస్టీలకు భారీగా ప్రోత్సహకాలు

హైదరాబాద్: సొంత ఉపాధి కేంద్రం పెట్టుకోవాలనేది యువతకు కల. సాంకేతిక ప్రపంచంలో స్టార్టప్ లు పెట్టుకోవడం ఎలాగో.. తయారీ రంగంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు అలా పెట్టుకుని సొంత కాళ్లపై నిలబడి.. మరో పది మందికి ఉపాధి కల్పించాలని పట్టుదలతో శ్రమించేవారు ఉంటారు. ఇలాంటి వారికి ప్రోత్సాహం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేకంగా ఈ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పాలసీని ప్రకటించింది. శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ పాలసీని విడుదల చేసి తమ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఇరవై పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలనుకుంటోంది. అందులో ఇరవై శాతం ప్లాట్లను చిన్న పరిశ్రమల కోసం రిజర్వ్ చేస్తారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్.. రీజనల్ రింగ్ రోడ్ మధ్య ప్రభుత్వం పది పారిశ్రామిక పార్కులను నిర్మించబోతోంది. వీటిలో ఐదు ప్రత్యేకంగా సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమల కోసమే కేటాయిస్తారు. ప్రతి పారిశ్రామిక పార్కులో మహిళలకు ఐదు శాతం.. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు పదిహేను శాతం ప్లాట్లు రిజర్వ్ చేస్తారు. ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను ప్రత్యేకంగా కసరత్తు చేసి గుర్తించింది. మొత్తంగా ఆరు సమస్యలను గుర్తించింది. భూమి , మూలధనం, ముడిపదార్థాలు, శ్రామిక శక్తి, సాంకేతిక సౌలభ్యత, మార్కెట్‌తో అనుసంధానం వంటి సమస్యల వల్ల సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సవాళ్లుగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్యను అధిగమించడానికి కొత్త పాలసీలో దాదాపుగా నలభై ప్రతిపాదనలు చేసింది. సరసమైన ధరలకు భూమిని అందుబాటులో ఉంచడం దగ్గర నుంచి అన్ని అంశాల్లో ప్రభుత్వ పరమైన సాయం అందించాలని నిర్ణయించారు. మొత్తంగా ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ వెన్నుదన్నుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే తెలంగాణకు పారిశ్రామిక పాలసీ ఉంది. దాన్ని టీఎస్‌ఐపాస్ గా పిలుస్తున్నారు. అయితే ఇది పెద్ద పరిశ్రమలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ చిన్న , సూక్ష్మ తరహా పరిశ్రమల విషయంలో ప్రయోజనకరంగా లేదు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఓఓఇలకు కొత్త పాలసీ రూపొందించామని ఉన్నతాధికారి జయేష్ రంజన్ ప్రకటించారు. చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం వైపు నుంచి పూర్తి స్థాయి సహకారం ఉంటుందన్నారు.

# పదిహేను రోజుల్లో నేల మట్టం చేయాలి

## హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ ఆఫీస్‌ను కూల్చేయాలని తెలంగాణ హైకోర్టు అధికారులను ఆదేశించింది. నల్గొండలోని ఆఫీస్‌ను పదిహేను రోజుల్లో నేల మట్టం చేయాలని స్పష్టం చేసింది. నల్గొండలో ఉన్న బీఆర్ఎస్ ఆఫీస్‌ను రెగ్యులరైజ్ చేసేలా అధికారులను ఆదేశించాలన్న పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. అనుమతి తీసుకోకుండా ఆఫీస్ కట్టి... ఇప్పుడు రెగ్యులరైజ్ చేయాలని అడగడం ఏంటని ప్రశ్నించింది. అనుమతులు లేకుండా అక్రమంగా కట్టిన ఆఫీస్‌ను 15 రోజుల్లో కూల్చేయాలని స్పష్టం చేసింది. దీంతోపాటు దానికి అయ్యే ఖర్చును నష్టపరిహారం రూపంలో లక్షరూపాయలను బీఆర్ఎస్ పార్టీ చెల్లించాలని తేల్చి చెప్పింది. . అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణం పూర్తి చేసింది. దీనిపై మున్సిపల్ అధికారులు నోటీసు జారీ చేశారు. 99 ఏళ్ల పాటు ఆ భూమిని లీజుకు తీసుకుంది. ఏడాదికి గజానికి వంద రూపాయల ఒప్పందం కుదుర్చుకుందిఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. బీఆర్ఎస్ ఆఫీసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పార్టీ ఆఫీసును కట్టారని, దానిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు నోటీసులు జారీ చేసింది. దాన్ని సవాల్ చేస్తూ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని హైకోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్ పార్టీ. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, లక్ష రూపాయలు నష్ట పరిహారం చెల్లించి 15 రోజుల్లోగా పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆఫీసు కట్టి ఐదేళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇప్పుడు రెగ్యులరైజ్ చేయడానికి అనుమతులు ఏంటని ప్రశ్నించింది. ఇరువర్గాల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఎందుకు వివాదం చేస్తున్నారో తెలీదన్నారు. ప్రభుత్వం వేసిన కౌంటర్‌లో మున్సిపల్ శాఖ అధికారుల నుంచి ఎలాంటి పర్మీషన్ తీసుకోలేదని ప్రస్తావించారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని కాకుండా, పక్కనున్న కొంతమంది వ్యక్తుల భూములను సైతం తీసుకున్నారని పేర్కొంది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, చివరకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి విలువ అక్షరాలు 100 కోట్లు రూపాయలుగా ఉంటుందని ఓ అంచనా.

# జమిలీ ఎన్నికల దిశగా అడుగులు

న్యూఢిల్లీ: జమిలీ ఎన్నికలు నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్న కేంద్రం మరో ముందడుగు వేసింది. ఈ అంశంపై గతంలో నియమించిన మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ నివేదికను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నివేదికను గతంలో రాష్ట్రపతికి కోవింద్ సమర్పించారు. ఇందులో వన్ నేషన్,వన్ ఎలక్షన్ విధానాలకు అనుకూలంగా సిఫారసులు చేశారు. తర్వాత పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై బిల్లు పెట్టి ఆమోదింప చేసుకుంటే.. తర్వాత నుంచి జమిలీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కోవింద్ కమిటీ జమిలీ ఎన్నికలకు అనుకూలంగా కీలక సిఫారసులు చేసినట్లుగా తెలుస్తోంది. కమిటీ ప్రాథమిక నివేదికను మార్చి 15న నివేదికను సమర్పించింది. మూడో సారి అధికారం చేపట్టగానే ప్రధాని మోదీ నూతన ప్రభుత్వానికి నిర్దేశించిన తొలి 100 రోజుల ఎజెండాలో ఇది కూడా భాగమేనని ప్రకటించారు. ఆ ప్రకారం వందరోజుల పాలన ముగుస్తున్న సమయంలో ఈ కమిటీ నివేదికకు ఆమోద ముద్ర వేశారు. ముందుగా లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, అవి పూర్తయిన 100 రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటి సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణల చేయాల్సి ఉంటుందని రాజ్యాగం నిపుణులు చెబుతున్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీలు, మునిసిపాలిటీలకు ఏకకాల ఎన్నికలు, ఏకకాల ఎన్నికల సుస్థిరత , కామన్ ఎలక్టోరల్ రోల్ కు సంబంధించిన అంశాల తో రాజ్యాంగసవరణ చేయాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికల కోసం అసెంబ్లీల కాల పరిమితి మూడు లేదా ఆరు నెలల కాలవ్యవధిని కుదించాల్సిన లేదా పెంచాల్సిన రాష్ట్రాలు ఉంటాయి. అలాగే ఏ కారణంతో అయినా ప్రభుత్వం పడిపోతే మిగిలినకాలానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించేలా సవరణ చేయాల్సి ఉంది. అయితే జమిలీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకిస్తు న్నాయి. ఉభయసభల్లో ఎన్డీఏకు సాధారణ మెజార్టీనే ఉన్నందున.. రాజ్యాంగ సవరణలు సాధ్యం కాదన్న వాదన వినిపిస్తోంది. ఈ విషయంలో కేంద్రం ఎలాంటి వ్యూహం పాటిస్తుందో కానీ.. రాజ్యాంగస వరణ చేయాల్సిన పరిస్థితి వస్తే.. పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టినప్పటికీ అది కోల్డ్ స్టోరేజీకి వెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే గతంలో మెజార్టీ పార్టీలు సానుకూలత వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ పార్టీతో చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధిస్తే బిల్లు పాసవడం సులభమేనని చెబుతున్నారు.

# అక్టోబర్ నెలలో 12 రోజులపాటు బ్యాంకులకు సెలవులు

న్యూ ఢిల్లీ;రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్ మాసానికి సంబంధించిన సెలవుల జాబితాను విడుదల చేసింది. దాదాపు 12 రోజులపాటు బ్యాంకులు మూతపడనున్నాయి. బ్యాంకుల్లో ఏవైనా పనులు ఉంటే ముందస్తుగా చేసుకోవడం మంచిది. లేకపోతే ఇబ్బందులుపడే ఛాన్స్ ఉంటుంది. అక్టోబర్‌లో గాంధీ జయంతి, బతుకమ్మ పండుగ, దసరా శరన్నవరాత్రులు, కర్వాచౌత్, ధన్‌తేరాస్, దీపావళి పండుగల సందర్భంగా సెలవులు రానున్నాయి. పండుగలు, ప్రత్యేక రోజులు, శనివారాలు.. ఆదివారాల్లో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవులు పడనున్నాయి. అయితే, రాష్ట్రాల వారీగా సెలవుల్లో మార్పులు ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో పండుగలకు సెలవులు ఉంటాయి. అలాగే, రెండు, నాల్గో శనివారాలతో పాటు ఆదివారాలు దేశవ్యాప్తంగా బ్యాంకులు మూతపడే విషయం తెలిసిందే. అయితే, ఇంతకీ బ్యాంకులకు ఎప్పుడెప్పుడు సెలవులు వచ్చాయో సెలవులు జాబితా...

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బ్యాకులకు సెలవు.

అక్టోబర్ 3న నవరాత్రి వేడుకలు ప్రారంభం. మహారాజా అగ్రసేన్ జయంతి సందర్భంగా బ్యాంకులకు సెలవు.

అక్టోబర్ 6న ఆదివారం బ్యాంకుల మూసివేత.

అక్టోబర్ 10 మహా సప్తమి సందర్భంగా బ్యాంకులకు హాలీడే.

అక్టోబర్ 11న మహానవమి సందర్భంగా మూసివేత.

అక్టోబర్ 12న దసరా, రెండో శనివారం సందర్భంగా బ్యాంకుల మూసివేత.

అక్టోబర్ 13న ఆదివారం కావడంతో సెలవు.

అక్టోబర్ 17న కటి బిహు (అసోం), వాల్మీకి జయంతి కారణంగా బ్యాంకులకు హాలీడే.

అక్టోబర్ 20న ఆదివారం సెలవు.

అక్టోబర్ 26న విలీన దినోత్సవం సందర్భంగా జమ్మూ కశ్మీర్‌లో, నాల్గో శనివారం కారణంగా హాలీడే.

అక్టోబర్ 27న ఆదివారం సెలవు.

అక్టోబర్ 31న దీపావళి, సర్దార్ వల్లభాయ్ పటేల్ సందర్భంగా సెలవు.

# ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే మోడీ లక్ష్యం

## దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు
## బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్: దేశంలో అన్ని సామాజికవర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా మోడీ వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుదవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కార్మిక, కర్షక, శ్రామికుల అభివృద్ధికి మోడీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ వెళ్తోందని,.మహిళల సాధికారత కోసం మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు..75 ఏళ్ల పైబడిన ఆరు కోట్ల మందికి హెల్త్ కార్డులు ప్రొవైడ్ చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఈకో సిష్టాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మ్యాన్ ఫ్యాక్చర్ హబ్ గా ఇండియా వేగంగా దేశం అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ నిలబడబోతోండాంటే అది ప్రదాన మంత్రో నరేంద్ర మోడీ కృషి పట్టుదల అన్నారు

.జమిలీ ఎన్నికల పై స్పందిస్తు దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు. జమిలి తో సమయం డబ్బు రెండు అదా అవుతాయి. దేశంలో నిత్యం ఏదో ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో దేశ అభివృద్ధికి కొంత ఆటంకం ఏర్పడుతుంది. దేశ అభ్యున్నతి కోసం తీసుకున్న నిర్ణయాలు కొంత మందికి నచ్చవు. జమిలీ ఎన్నికలకు కొంత సమయం పడుతుంది. అందుకే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల కు ఎన్నికలు. పార్లమెంట్ లో జమిలి బిల్లు ప్రవేశ పెడతారు. అప్పుడు అందరికీ మాట్లాడే అవకాశం వస్తది. ప్రతిపక్షాలకు ఏదైనా అభ్యంతరం ఉంటే చర్చలో చెప్పొచ్చు. నన్నారు.

# రష్యాలో కొత్త పిలుపు.. జనాభా కోసం కొత్త ఆఫర్

మాస్కో: కొన్నిసార్లు ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చే పిలుపులు చాలా ఆశ్చర్యకరంగా ఉంటాయి. దేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రకరకాల చర్యలు తీసుకుంటూ ఉంటుంది. అయితే జనాభా తగ్గిపోతుండటం అనేది ఏ దేశానికైనా పెద్ద ఎదురుదెబ్బగా మారుతుంది. అందుకే పెళ్లిళ్లు చేసుకోండి, పిల్లల్ని కనండి అంటూ చాలా ప్రభుత్వాలు.. ప్రజలను ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే తాజాగా రష్యా ప్రజలకు వ్లాదిమిర్ పుతిన్ ప్రభుత్వం ఇచ్చిన సూచన వింటే షాక్ అవుతారు. రష్యాలో జననాల రేటు పడిపోతుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్ సర్కార్.. ప్రజలకు కీలక సూచన ఇచ్చింది. లంచ్, కాఫీ బ్రేక్‌లలో శృంగారంలో పాల్గొనాలని వింత సూచన చేసింది. ఇప్పుడు ఇదే తీవ్ర చర్చకు దారి తీస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు.. ఆ దేశంలో చర్చకు దారితీశాయి. రష్యాలో జననాల రేటు రోజురోజుకూ పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్.. సంతానోత్పత్తిని పెంచాలని సూచించారు. ఇందులో భాగంగానే రష్యా ప్రజలు.. పనివేళల్లో భోజన విరామం, కాఫీ విరామాల్లో శృంగారంలో పాల్గొనాలని పేర్కొ?న్నారు. తద్వారా దేశ జనాభా రేటు క్షీణతను తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రష్యాలో స్థిరమైన జనాభా కోసం సంతానోత్పత్తి రేటు ఒక మహిళకు 2.1గా ఉండగా.. ఆ దేశంలో ప్రస్తుతం 1.5గా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఈ సూచన చేశారు. అయితే రష్యాలో జనాభా పెరుగుదల ఆవశ్యకతను గతంలో పుతిన్ గుర్తు చేశారు. రష్యా ప్రజల సంరక్షణ అనేది తమ దేశ జాతీయ ప్రాధాన్యత అని పుతిన్ వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా 10 లక్షలకు పైగా యువకులు రష్యాను వీడినట్లు తెలుస్తోంది. ఓవైపు.. సంతానోత్పత్తి రేటు తగ్గడం, మరోవైపు.. యువత దేశాన్ని వీడటంతో పుతిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక రష్యాలో తగ్గుతున్న సంతానోత్పత్తిపై ఆ దేశ ఆరోగ్య మంత్రి డాక్టర్ యెవ్జెనీ షెస్టోపలోవ్ స్పందించారు. చాలా మంది జనం.. పిల్లల్ని కనేందుకు వెనక్కి తగ్గుతున్నారని.. అయితే జీవితం తొందరగా ముగుస్తుందని గుర్తు చేశారు.

అందుకే రోజుకు 12 నుంచి 14 గంటలు పని చేసేవారు కూడా తమకు దొరికిన కాస్త బ్రేక్ సమయంలోనైనా సంతానోత్పత్తి పెంచేందుకు సెక్స్‌లో పాల్గొనాలని ప్రజలకు సూచించారు. 1999 జూన్‌లో రష్యాలో లక్ష కంటే తక్కువగా జననాలు నమోదు అయ్యాయి. అయితే అంతకుముందు గణాంకాలతో పోలిస్తే అదే కనిష్టం కావడం గమనార్హం. ఇక యూరో న్యూస్ రష్యా యొక్క అధికారిక గణాంకాల ఏజెన్సీ రోస్‌స్టాట్ ప్రకారం.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి 6నెల్లలో 16వేల కంటే తక్కువ జననాలు నమోదయ్యాయి. మరోవైపు.. జనాభా క్షీణత 18శాతం అదనంగా పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాదిలోనే 49వేల మరణాలు సంభవించగా.. అందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగానే అధికంగా మరణాలు సంభవించాయని తెలిపింది

# రెండుగా చీలిన గులాబీ పార్టీ..

హైదరాబాద్: బీఆర్ఎస్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోందా? ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ- కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై కారు పార్టీలో అంతర్గత ప్రకంపనలు కొనసాగుతున్నాయా? ఈ ఎపిసోడ్‌లో గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు ఎందుకు దూరంగా ఉన్నారు? అధినేత ఉండమన్నారా? తమ కుర్చీ కిందకు నీళ్లు రాకుండా ఎమ్మెల్యేలు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారా? అధినేత కేసీఆర్ సైలెంట్ వెనుక కారణం అదేనా? దీన్ని హ్యాండిల్ చేయమని కేటీఆర్ అప్పగించారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ- కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. ఈ విషయాన్ని హరీష్‌రావు, కేటీఆర్‌లు మాత్రమే స్పందించారు. దీన్ని శాంతిభద్రతల ఇష్యూగా డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ప్రాంతీయం చిచ్చు ప్రజల్లోకి వెళ్లిపోయింది. దీంతో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు అంటిముట్టనట్టుగా ఉంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 16 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. రీసెంట్‌గా జరిగిన ఉప ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ జారిపోయింది. 15 సీట్లకు గాను ఖైరతాబాద్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు కారు పార్టీ కీలక నేతలు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఆ సంఖ్య 12కి పడిపోయింది. ప్రాంతీయం మాటల ఎపిసోడ్ తమ ఓటు బ్యాంకు మీద ప్రభావం చూపుతుందే మోనని భయపడుతున్నారు మిగతా ఎమ్మెల్యేలు. కౌశిక్‌రెడ్డి ఇంటి ఘటన తర్వాత ఆయనను పరామర్శించేందుకు గ్రేటర్ పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలు కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కానీ విడివిడిగా వెళ్లారు. ఏ ఒకొక్కరుగా నోరు మెదపలేదు. మీడియా ముందు మాట్లాడే ప్రయత్నం చేయలేదు. గ్రేటర్‌లోని ప్రతీ నియోజకవర్గంలో గెలుపు ఓటములు శాసించే స్థాయిలో ఆంధ్రా ఓటర్లు ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరువు కాపాడింది వాళ్లే. ఈ సమయంలో కౌశిక్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడి ఇరుక్కోవడం ఎందుకని భావిస్తున్నారట. ఈ విధంగా తమ కుర్చీ కిందకు నీళ్లు తెచ్చుకోవడం కంటే.. దూరంగా ఉండడమే బెటరని దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు నిర్ణయానికి వచ్చినట్టు ఆ పార్టీ అంతర్గత సమాచారం. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. రేపటి రోజున మరి కొందరు ఎమ్మెల్యేలు కారు దిగి అధికార పార్టీ గూటికి చేరుతారనే వార్తలు జోరందుకున్నాయి. ఈ ఇష్యూని హ్యాండిల్ చేయమని కేటీఆర్‌కు అధినేత కేసీఆర్ అప్పగించినట్టు ఆ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో యువనేత ప్రత్యేకంగా మాట్లాడుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం కారు పార్టీలో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# 47 స్థానాల్లో 19 కమలం పోటీయేనా..?

## ముందే హ్యాండ్స్ అప్పా...

శ్రీనగర్: దాదాపు 10 సంవత్సరాల తర్వాత జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. 2014లో జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎలక్షన్స్ లో పీడీపీ 28 సీట్లు గెలిచింది. భారతీయ జనతా పార్టీ 25 అసెంబ్లీ స్థానంలో ఘన విజయం సాధించింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో పిడిపి, బిజెపి కలిసి సంయుక్తంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.. అయితే ఆ తర్వాత విభేదాలు పొడ చూపడంతో పీడీపీ, భారతీయ జనతా పార్టీ కటీఫ్ చెప్పుకున్నాయి. నేతలు ఎవరి దారి వారు చూసుకున్నారు. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ త్రిబుల్ తలాక్ ను రద్దు చేసింది. అదే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో గణనీయమైన మార్పును చూపించింది. ఆ తర్వాత ఆర్టికల్ 370 ని రద్దు చేసింది. అది జమ్మూ కాశ్మీర్లో పెను సంచలనానికి కారణమైంది. దీంతో ఈసారి జరిగే ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. జమ్ము కాశ్మీర్లో ప్రజలకు మెరుగైన భద్రత కల్పించామని.. స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే అవకాశం ఇచ్చామని..లాల్ చౌక్ లో జాతీయ జెండాను ఎగరవేశామని బిజెపి నాయకులు చెబుతున్నారు.. మరోవైపు అమర్ నాథ్ యాత్రలో భక్తులకు భద్రత కల్పించాల్సిన దుస్థితి నెలకొందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇలా సవాళ్లు, ప్రతి సవాళ్ల మధ్య తొలి దశలో ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి దశలో 24 సెగ్మెంట్లకు ఎలక్షన్స్ నిర్వహిస్తున్నారు.. 24 సెగ్మెంట్లలో 16 కాశ్మీర్ వ్యాలీలో ఉన్నాయి. మిగతా ఎనిమిది జమ్మూ కాశ్మీర్ డివిజన్లో ఉన్నాయి. జమ్ము కాశ్మీర్లో జరిగే ఎన్నికల్లో కమలం పార్టీకి కష్టకాలం ఎదురవుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో 47 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 19 మంది అభ్యర్థులను మాత్రమే బిజెపి పోటీలోకి దింపింది. అంటే 28 స్థానాలలో బిజెపి పోటీ చేయడం లేదు. వాస్తవానికి ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్లో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని బిజెపి నాయకులు అంటున్నారు. అని వాస్తవ పరిస్థితి అలా లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. శ్రీవల్లి పార్లమెంటు ఎన్నికల్లో జంబుకాశ్మీర్ రాష్ట్రంలో బిజెపి అభ్యర్థులను పోటీలో నిలపలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో సగం కంటే తక్కువ స్థానాలలో అభ్యర్థులను పోటీలో ఉంచడంపై రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి..” ముందుగా మేము ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు. టికెట్ ఇచ్చినా మీరు ఎన్నికల్లో నెగ్గే పరిస్థితి లేదు. ఇది మా పార్టీ అధిష్టానం నుంచి మాకు వ్యక్తమైన సందేశం. అందువల్లే మాకు చాలా ఇబ్బందిగా ఉంది. బలహీనంగా ఉన్న స్థానాలలో అభ్యర్థులను నిలిపే అవకాశం లేదని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని” పేరు రాయడానికి ఇష్టపడని బిజెపి నాయకుడు పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కాశ్మీర్ లోయలో అభ్యర్థులను పోటీలో ఉంచలేదు. ఇక జంబులోని రెండు పార్లమెంట్ స్థానాలను బిజెపి దక్కించుకుంది. జమ్ము కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2019లో రద్దు చేసింది. ఆ సమయంలో కాశ్మీర్ లోయలో చాలా రోజులు నిరసనలు వ్యక్తమయ్యాయి. సమ్మెలు చోటుచేసుకున్నాయి. ఆందోళనలో తగ్గించడానికి భద్రత దళాలు బందోబస్తు పటిష్టం చేశాయి..ఆర్టికల్ 370 ని రద్దు చేసిన తర్వాత కాశ్మీర్ లోయలో శాంతి ఏర్పడిందని.. సాధారణ జీవితం ఏర్పడిందని బిజెపి ప్రకటించింది. లోయ ప్రాంతంలో తీవ్రవాదుల కదలికలు తగ్గిపోయాయని.. ప్రజలు స్వేచ్ఛ జీవితానికి అలవాటు పడుతున్నారని వివరించండి. ఈ ఏడాది మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీనగర్ ప్రాంతంలో పర్యటించారు. ర్యాలీ నిర్వహించారు.. అయినప్పటికీ ఆ ప్రాంతంలో బిజెపి అభ్యర్థులను నిలబెట్టలేదు. ఏకంగా 28 స్థానాలలో అభ్యర్థులను నిలపకపోవడం సరికొత్త విశ్లేషణలకు కారణమవుతోంది. ఇదే విషయంపై బిజెపి జమ్ము కాశ్మీర్ అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ స్పందించారు. “ అసెంబ్లీ ఎన్నికలు మాకు ఒక పరీక్ష లాంటివి. ప్రస్తుత పరిస్థితుల్లో మేము విజయం సాధిస్తే వచ్చే కాలంలో పోటీలో దిగుతాం. కాశ్మీర్ లోయలో కమలం వికసిస్తుందని నమ్మకం మాకుంది. ఏడు స్థానాలను గెలుచుకుంటామని భావిస్తున్నాం. తక్కువమంది అభ్యర్థులను నిలపడం మా వ్యూహాల్లో ఒకభాగమని”ఆయన వివరించారు.

# భూమి లేని రైతులకు ఆర్థిక సాయం

నిజామాబాద్: తెలంగాణ సర్కార్ రైతన్నలకు మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... మీడియాతో మాట్లాడుతూ ప్రజల చేత, ప్రజల అవసరాల కోసం ఏర్పడిందే ఈ ప్రజాపాలన ప్రభుత్వం అన్నారు. భారత రాజ్యాంగం మేరకు ప్రజాపాలన నడుస్తుందన్నారు. ప్రజాస్వామ్యాని గౌరవించే ప్రతి ఒక్కరు ప్రజాపాలనను స్వాగతించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి చూశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అలాంటి పాలనా నుంచి నేడు విముక్తి పొందామన్నారు. ప్రజాపాలనలో అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామన్నారు. రైతులకు పంట బీమా, వ్యక్తిగత ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామన్నారు. దీంతో పాటు సోలార్ పంపు సెట్లతో ఆదాయం వచ్చేలా ప్రణాళికలు వేస్తున్నామన్నారు. అలాగే భూమిలేని రైతు కూలీల కు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ఇచ్చే ఆలోచన చేస్తున్నామ న్నారు. ఐకేపీ ద్వారా మహిళలు ఆర్గానిక్ ఫార్మిగ్ చేసేలా కృషి చేస్తున్నామన్నారు. పక్కదారి పట్టిన దళిత బంధు యూనిట్లు తిరిగి అమల్లోకి తెచ్చే బాధ్యత అధికారులదే అన్నారు. తెలంగాణ రైతుల కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ ఖరీఫ్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇది విప్లవాత్మక నిర్ణయ మని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఖరీఫ్ నుంచి సన్నాలకు 500 రూపాయల బోనస్ అందించనున్నట్లు మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఖరీఫ్ నుంచే సన్నాలకు (సన్న రకం ధాన్యం) 500 రూపాయల బోనస్ ను చెల్లించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సన్న వడ్లకు వానాకాలం నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకు ంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు రైతులకు హామీలు ఇచ్చారు. వీటిల్లో రూ.2 లక్షల రైతు రుణ మాఫీ, వరి పంటకు రూ.500 బోనస్. తాజాగా బోనస్ పై ప్రభుత్వం ప్రకటన చేసింది.

500 బోనస్....

తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ ఖరీఫ్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇది విప్లవాత్మక నిర్ణయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఖరీఫ్ నుంచి సన్నాలకు 500 రూపాయల బోనస్ అందించనున్నట్లు మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఖరీఫ్ నుంచే సన్నాలకు(సన్న రకం ధాన్యం) 500 రూపాయల బోనస్ ను చెల్లించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సన్న వడ్లకు వానాకాలం నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు రైతులకు హామీలు ఇచ్చారు. వీటిల్లో రూ.2 లక్షల రైతు రుణ మాఫీ, వరి పంటకు రూ.500 బోనస్. తాజాగా బోనస్ పై ప్రభుత్వం ప్రకటన చేసింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సోమవారం సాయంత్రం ఎర్రమంజిల్ కాలనీలోని జలసౌదలో సమావేశం అయ్యింది. ఉపసంఘం ఛైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనరసింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, లోకసభ సభ్యులు మల్లు రవి, అధికారులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై కేబినెట్ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఇప్పటికే అమలులో ఉన్న పంజాబ్, హర్యానా,తమిళనాడులో ఉపసంఘం అధ్యాయనం చేయనుందన్నారు. ఇదే విషయంలో ప్రజాభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించామన్నారు. న్యాయపరమైన అంశాలలో నిపుణుల సూచనలు తీసుకుంటామన్నారు. న్యాయపరంగా ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఉండేలా పకడ్బందీగా ముందుకు వెళ్తామన్నారు.

# కేకే కల ఫలించేనా..?

కరీంనగర్: కే.కే.మహేందర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి జై తెలంగాణ అంటూ గళం విప్పిన లీడర్. రెండు దశాబ్దాలుగా ప్రతిపక్ష నేతగానే కొనసాగుతున్న కేకే మహేందర్‌రెడ్డికి త్వరలో మంచి రోజులు రాబోతున్నాయనే ప్రచారం ఆయన అనుచరుల్లో ఉత్సాహం నింపుతోంది. అటు కే.కే. మహేందర్‌రెడ్డికి కొత్త ఉత్తేజం తెస్తోందంటున్నారు. నాడు ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న టీఆర్ఎస్‌తో పొలిటికల్ కెరీర్ ప్రారంభించిన కే.కే.మహేందర్‌రెడ్డి వరుసగా ఐదుసార్లు అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. రాజకీయ ప్రత్యర్థి కేటీఆర్‌తో ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడుతున్న కే.కే.మహేందర్‌రెడ్డిని పట్టు వదలని విక్రమార్కుడిగా చెబుతుంటారు. తొలుత వామపక్ష విద్యార్థి సంఘాల్లో పనిచేసిన కేకే మహేందర్‌రెడ్డి.. 2009లో తొలిసారి అసెంబ్లీకి పోటీ చేయగా, కేవలం 171 ఓట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోవడం వల్ల కేటీఆర్‌పై స్వతంత్రంగా పోటీ చేసి ఓటమి అంచుల వరకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కేటీఆర్ నిలదొక్కుకోవడంతో కే.కే.మహేందర్‌రెడ్డికి గెలుపు పిలుపు అందలేదు. కానీ, ఆయన ఏనాడూ నిరాశ చెందలేదు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ.. కేటీఆర్‌తో అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉండటంతో కే.కే.మహేందర్‌రెడ్డికి ఏ పదవి ఇస్తారా? అని కాంగ్రెస్ క్యాడర్ ఆసక్తిగా ఎదురుచూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైంది. ఇప్పటికే చాలా మందికి నామినేటెడ్ పోస్టుల్లో నియమించిన పార్టీ? కే.కే.మహేందర్‌రెడ్డిని వదిలేసిందని విమర్శలు ఎదుర్కొంది. అయితే ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామనే హామీతోనే వెయిటింగ్‌లో పెట్టినట్లు తాజాగా ప్రచారం జరుగుతోంది. కొద్దిరోజుల్లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో తొలి అవకాశం కే.కే.మహేందర్‌రెడ్డికే ఇస్తారని చెబుతున్నారు. రెండు దశాబ్దాలుగా గెలుపోటములతో సంబంధాలు లేకుండా రాజకీయ పోరు సాగిస్తున్న మహేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఆయన వర్గీయులు ఆశిస్తున్నారు. ఎమ్మెల్సీ హామీతో మహేందర్‌రెడ్డి కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. రెండు దశాబ్దాలుగా చట్టసభల్లో అడుగు పెట్టాలనే తన ఆకాంక్ష త్వరలో ఫలించే అవకాశం ఉందన్న సమాచారంతో? మంచి రోజులు ఎప్పుడొస్తాయా? అని ఎదురుచూస్తున్నారట? మొత్తానికి కాంగ్రెస్ అధినాయత్వం హామీతో సిరిసిల్ల కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. మొత్తానికి కే.కే.మహేందర్‌రెడ్డి ఎపిసోడ్ కాంగ్రెస్‌లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రాజకీయల్లో ఫాస్ట్ ట్రాక్‌లో పదవులు పొందిన నేతలు ఎందరో ఉన్నారు? బై పాస్‌లో వచ్చి కుర్చీ మీద కూర్చున్న నేతలు చాలా మంది కనిపిస్తుంటారు. కానీ.. ఏ పదవీ లేకుండా మహేందర్‌రెడ్డి వంటి నేతలు అరుదుగా కనిపిస్తుంటారు. ఇప్పటికైనా ఆయన నిరీక్షణ ఫలిస్తుందో? లేదో? అన్నదే ఆసక్తికరంగా మారింది. మహేందర్‌రెడ్డి కల నెరవేరాలంటే మరికొద్ది రోజులు వేచిచూడాలి

# సీఎం రేవంత్ కుర్చీలో కూర్చునే దాకా ఒకమాట - కూర్చున్నాక మరో మాట

## రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలి రుణమాఫీ కానీ రైతుల వివరాల పత్రాలను కలెక్టర్ కు అందజేత బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల: రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.. బుధవారం జిల్లాలోని రుణమాఫీ కానీ రైతులకు మద్దతుగా జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అద్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ,కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డా.సంజయ్,జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత-సురేష్ ,చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ,రాష్ట్ర నాయకులు వొరకంటి రమణారావు,డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిలు రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ సత్య ప్రకాష్ కు వినతిపత్రంతో పాటు రుణమాఫీ కానీ రైతుల వివరాల పత్రాలను అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కుర్చీలో కూర్చునే దాకా ఒకమాట - కూర్చున్నాక మరో మాట మాట్లాడుతున్నారన్నారు. డిసెంబర్ 9 న రుణమాఫీ, రైతు భరోసా, కూలీలకు కూడా డబ్బులు ఇస్తామని మాయ మాటలు చెప్పారన్నారు. అబద్దపు పునాదుల మీద రేవంత్ రెడ్డి గద్దెనెక్కారు. అది ఎంతో కాలం నిలవదన్నారు.. రైతు బంధుని భరోసా గా పేరు మార్చి నిధులు ఇవ్వలేదని విమర్శించారు.. 40% మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. పల్లెల్లో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఊరిలోకి వెళ్లి రైతులను అడగండి. వాస్తవాలు తెలుస్తాయిన్నారు.. రైతుల ఉసురు తప్పక ప్రభుత్వానికి తగులుతుందని కుర్చీలా కోసం, పదవులు కాపాడుకోవడం కోసం ఢిల్లీ పెద్దల మెప్పు కోసం విగ్రహాలు ఏర్పాటు చేయడం తప్ప, రైతు రుణమాఫీ పై శ్రద్ద లేదని విమర్శించారు.. కుర్చీ గ్యారంటీ పై ఉన్న ధ్యాస, ఇచ్చిన అరు గ్యారంటీ లపై లేకపోవడం విచారకరం ఆన్నారు. కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం ఆని, 24 గంటల కరెంట్, నీరు, విత్తనాలు అందుబాటులో ఉంచి, పెట్టుబడి సాయం అందించి విత్తనం నాటిన నుండి పంట కొనుగోలు చేసే వరకు రైతుకు అండగా ఉండి రైతు బంధుగా మాజీ సీఎం కేసీఆర్ నిలిచారు. ఆ పాలనకు, మీ పాలన కు ఉన్న వ్యాత్సాహం చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి,శేరుతులు లేకుండా భేషరతుగా రుణమాఫీ చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు,మాజీ జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు,మాజీ ఏఎంసీ చైర్మన్లు,వైస్ చైర్మన్లు,బిఆర్ఎస్ పార్టీ గ్రామ,మండల నాయకులు,కార్యకర్తలు,మహిళలు ,రైతులు తదితరులు పాల్గొన్నారు..

# ఆవుల రవాణాను అడ్డుకున్న భజరంగ్ దళ్

సూర్యాపేట: హుజూర్ నగర్ పట్టణంలోని సీతారామ్ నగర్ లో ఓ వ్యక్తి ద్వారా కోదాడ పట్టణానికి చెందిన వ్యక్తి పది అవు దూడలను కొనుగోలు చేసారు. వీటిని బొలెరో వాహనం లో విచక్ష రహితంగా కాళ్ళను తాళ్లతో కట్టి తరలిస్తుండగా బజరంగ్ దళ్ సభ్యులు పట్టుకున్నారు. ఆవు దూడలను మున్సిపాలిటీలో ఉంచారు. పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ సభ్యులు శివ మాట్లాడుతూ గతంలో కూడా చాలా సార్లు గోవులను పట్టుకొని గో శాలకు తరలించడం జరిగింది. హుజూర్ నగర్ పట్టణంలో బొలెరో వాహనంకి చుట్టూ పట్టాలు కట్టి గుట్టు చప్పుడు కాకుండా ఆవు దూడలకు తరలిస్తున్నారు. వాహనం మీద డౌట్ వచ్చి అపి చూడగా అందులో దూడలు కనిపించాయి. డ్రైవర్ ను అడగక పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులు సమాధానం ఇవ్వడం జరిగింది. పోలీసులు వచ్చి ఆవు దూడలను మున్సిపల్ ఆఫీస్ లో దించి వాహనం ను పోలీస్ స్టేషన్ కి తరలించారు. గతంలో చాలా సార్లు ఆవులను కొనేవాళ్ళకి చెప్పడం జరిగింది. బోలోరో వాహనం లో 10 ఆవు దూడలను తరలించారు. అవి ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నాయి. తాళ్లతో కట్టివేయడం వల్ల కాళ్ళు వాపుకి గురైయని అన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

## సహకరించిన అందరికి ధన్యవాదాలు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్: గత ఏడాది తో పోలిస్తే మూడు గంటల ముందే నిమర్జన ప్రక్రియ పూర్తి అయింది. ఉదయానికి అన్ని ట్రాఫిక్ జంక్షన్ లు క్లియర్ అయ్యాయని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి వి అనంద్ వెల్లడించారు. బుధవారం అయన ట్యాంక్ బండ్ పై మీడియాతో మాట్లాడారు. సీపీ మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం నిమర్జనం పూర్తి చేసాం. నెక్లెస్ రోడ్ అలాగే ఐమాక్ వద్ద గ్రౌండ్స్ లో విగ్రహాలను పార్కింగ్ ఏర్పాటు చేసి సాధారణ ప్రజలకు రూట్ క్లియర్ చేసాం. ఖైరతాబాద్ గణేష్ నిమర్జనం అనుకున్న సమయానికి పూర్తి అయింది. ఈ నిమర్జన ప్రక్రియ లో పాల్గొన్న ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది కి ధన్యవాదాలని అన్నారు. రాత్రి 10:30 కి ఓల్డ్ సిటీ లో వినాయక విగ్రహాల నిమర్జనం పూర్తి అయినాయి. ఈరోజు వర్కింగ్ డే ప్రజలకి సహకరించాలి. లేకుంటే కఠిన చర్యలు ఉంటాయి. మంగళవారం హుస్సేన్ సాగర్ లో దాదాపు 15 వేల విగ్రహాల నిమజ్జనాలు పూర్తి అయ్యాయి. కొన్ని వాహనాల బ్రేక్ డౌన్ వల్ల కొంత ఆలస్యం అయింది . లేదంటే ఉదయం 7 గంటలకే నిమర్జన ప్రక్రియ పూర్తి అయేది. మొత్తం 11 రోజుల్లో కేవలం హుస్సేన్ సాగర్ లోనే లక్ష విగ్రహాలు నిమర్జనం పూర్తి అయ్యాయని అన్నారు.

# జానీ మాస్టర్ ఎక్కడ...?

హైదరాబాద్: నేషనల్ అవార్డ్ విన్నర్, స్టార్ కొరియోగ్రాఫర్ జానీ భాషాపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో విచారణ స్పీడందుకుంది. 376, 506, 323 (2) సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు నార్సింగ్ పోలీసులు. బాధితురాలిని ఆమె ఇంట్లో మూడు గంటల పాటు ప్రశ్నించారు. తనను లైంగిక వేధించాడని.. ప్రతిఘటిస్తే అవకాశా ల్లేకుండా చేస్తానని బెదిరించాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తడి చేశాడని..జానీ మాస్టర్ ఆయన భార్య తన ఇంటికి వచ్చి తనపై దాడి చేశారంటూ ఆమె చెప్పింది.. స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన పోలీసులు ఆమెను భరోసా సెంటర్‌కు తరలించారు. మరోవైపు జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల క్రమంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుండాలని ఆదేశించింది జనసేన. ఇక తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా స్పందించింది. వివాదం తేలే వరకు జానీ మాస్టర్‌ను డాన్సర్స్ అసోషియేషన్ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని ఫెడరేషన్‌ను ఆదేశించింది.ఇటు పోలీసు లు.. అటు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన ప్యానెల్.. తాజా వివాదంపై విచారణ చేపడుతున్నాయి. మరి ఆయనెక్కడ? స్పందనేంటి అనేది హాట్ టాపిక్ గా మారింది. లైంగిక వేధింపుల ఆరోపణలు, కేసుపై జానీ మాస్టర్ నుంచి ఇంకా స్పందన రాలేదు. గతంలోనే ఫిల్మ్ చాంబర్‌కు జానీ మాస్టర్ వేధిస్తున్నారని ఫిర్యాదు వెళ్లింది. అప్పట్లో ఆయన ఆ మ్యాటర్‌పై స్పందించారు కూడా.. కానీ ఇప్పుడు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొంటున్నారు.అసోసియేషన్‌కు సంబంధించి విభేదాలు, వివాదాల క్రమంలో జానీ మాస్టర్‌పై ఫిల్మ్ చాంబర్ ఏర్పాటు చేసిన ప్యానెల్‌కు ఫిర్యాదు వెళ్లింది. గత రెండు వారాలుగా పరిశీలన వుందన్నారు కమిటీ సభ్యులు. బాధితురాలు మొదట వర్క్ స్టేషన్‌లో హరాస్‌మెంట్ గురించి ఫిర్యాదు చేసిందన్నారు. అప్పట్లో బాధితురాలు సహా జానీ మాస్టర్ ఇద్దరి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశామన్నారు. కానీ లైంగిక వేధింపుల వ్యవహారం ఇప్పుడు తెరపైకి వచ్చిందన్నారు. తాజా వివాదంపై కమిటీ విచారణ కొనసాగుతుందన్నారు 90 రోజుల్లో క్లారిటీ వస్తుందన్నారు. డ్యాన్సర్స్ అసోషియేషన్ పూర్తి సహకారం అందిస్తున్నారు. ప్రతీ యూనియన్ విధిగా కంప్లైంట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.లైంగిక వేధింపులపై విచారణ ప్యానెల్‌కు ఝాన్సీ చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దామోదర్‌ప్రసాద్ సెక్రటరీగా తమ్మారెడ్డి భరద్వాజ, సుచిత్రా చంద్రబోస్, వివేక్ కూచిబొట్ల. ప్రగతి, మేడపాటి రామలక్ష్మి, లాయర్ కావ్య ప్యానెల్ సభ్యులుగా వున్నారు. జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల వివాదంలో ఖూఅఊ చట్టం 2013 మార్గదర్శకాల ప్రకారం విచారణ కొనసాగుతుందన్నరు. వర్క్ స్టేషన్‌లో మహిళల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# మళ్లా సోషల్ మీడియాలో అమృత

నల్గొండ: సోషల్ మీడియాలో తన వస్త్రాధారణపై, మీమ్ పేజెస్ లో విపరీతమైన ట్రోలింగ్ జరిగింది..!! తనపై అసభ్యకరమైన పోస్ట్ లు పెట్టిన ఎఆ లను గుర్తించి,వాటిపై మిర్యాలగూడ పోలిస్ స్టేషన్లో.. అమృత ఫిర్యాదు చేశారు...!! ఇది తెలిసిన కొంత మంది,తమ ఎఆ లోంచి ఆ పోస్ట్ లను వెంటనే డిలీట్ చేసారు..!! మిర్యాలగూడ కు చెందిన అమృత, అదే ఏరియాలో బాగా డబ్బు, పేరు ఉన్న మారుతీరావు కూతురు..!! అయితే చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచిన తన కూతురు, వేరే కులానికి చెందిన ప్రణయ్ అనే అబ్బాయిని ప్రేమించింది..ఈ విషయం తెలిసిన మారుతీరావు వాళ్ళ పెళ్ళికి అంగీకరించకపోవటంతో... అమృత ప్రణయ్ కులాంతర వివాహం చేసుకోవాల్సి వచ్చింది..! పరిస్థితుల్లో అమృత తన కుటుంబంతో విడిపోయి దూరంగా ఉంటూ,ప్రణయ్ వాళ్ళ ఇంట్లోనే ఉండేది..కొంత కాలం తర్వాత గర్భవతిగా ఉన్న అమృత హాస్పిటల్ కి చెకప్ కోసం వెళ్తుండగా.. హాస్పిటల్ సమీపంలో..ప్రణయ్ ని.. పదునైన కత్తితో వెనువెంటనే మెడ భాగంలో పోట్లు పొడిచారు..దానితో ప్రణయ్ అక్కడికక్కడే కుప్పకూలి, ప్రాణాలు విడిచాడు.. తర్వాత ఈ హత్య,తన తండ్రి మారుతీరావే చేయించానని పోలీసుల ముందు లొంగిపోయారు... ఏమైందో తెలియదు.. బెయిల్ మీద విడుదల అయిన తర్వాత ఆత్మహత్య చేసుకుని చనిపోయారు..!! . ఎవరి అజెండా వారిదే అప్పట్లో...ఇదొక పెద్ద ఉద్రిక్తతకు దారితీసింది.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా స్పందించి,పరామర్శకి వచ్చి, డబుల్ బెడ్రూం ఇళ్లు, మరియు గవర్నమెంట్ ఉద్యోగం ప్రకటించారు ..!! సోషల్ మీడియాలో ఆక్టివ్ గా ఉంటూ... అప్పటి నుంచి కొంత కాలం సోషల్ మీడియా కు దూరంగా ఉంటూ వస్తున్న అమృత,ఈ మధ్య రెగ్యులర్గా ఆక్టివ్ గా ఉంటూ...తన ఫ్యామిలీ, లైఫ్ స్టైల్ గురించి అప్డేట్స్ ఇస్తుంది..!! అయితే...ఇది నచ్చని కొందరు... ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ ఉండేవారు..కానీ.. నిన్న తను ఈ విషయం సీరియస్ గా తీసుకుని పోలిసులకు కంప్లైంట్ ఇచ్చింది..!!

# కృష్ణా, కృష్ణయ్యలను నమ్ముకున్న బీజేపీ...

హైదరాబాద్: నాలుగున్నరేళ్ల తర్వాత తెలంగాణలో అధికారంలోకి రావడమే టార్గెట్‌గా బీజేపీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఎదిగి? 2028 ఎన్నికల్లో విజయం సాధించడమే టార్గెట్‌గా పావులు దుపుతున్నారు కలమం పార్టీ అగ్రనేతలు. పక్కాప్లాన్ ప్రకారం పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారు. సామాజిక సమీకరణలతో పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్న కమలనాథులు? తెరచాటుగా మంత్రాంగం నడుపుతూ ప్రత్యర్థులను దెబ్బతీయాలని వ్యూహం రచిస్తున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 8 చోట్ల గెలిచిన బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికల్లో 8 స్థానాలను గెలుచుకుని 56 చోట్ల ప్రభావం చూపింది. ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రెండు రెట్ల బలం పుంజుకుని అసెంబ్లీపై బీజేపీ జెండా ఎగరేయాలని భావిస్తోంది. ఇందుకోసం బీసీలు, ఎస్సీలకు దగ్గరవ్వాలని పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో బీసీ సీఎం నినాదంతో ఆయా వర్గాలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించిన బీజేపీ? లోక్‌సభ ఎన్నికల నాటికి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన విధానం తీసుకుని ఎంఆర్‌పీఎస్ మద్దతు పొందింది. దీంతో మెజార్టీ నియోజకవర్గాల్లో బీజేపీకి మేలు జరిగిందని విశ్లేషణలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణను బీజేపీలో చేర్చుకోవాలనేది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇప్పటికే బీజేపీ పట్ల సానుకూలంగా ఉన్న మంద కృష్ణమాదిగ బీజేపీలోకి వస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. తాను రాజకీయ పార్టీలకు దూరమని మంద కృష్ణమాదిగ చెబుతున్నా, ఆయనను ఎలాగైనా ఒప్పించాలనేది కమలనాథుల ఆలోచనగా కనిపిస్తోందంటున్నారు. ఇక ఇదే సమయంలో బీసీ నేత ఆర్.కృష్ణయ్యపైనా బీజేపీ ఫోకస్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం ఏపీ నుంచి వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఆర్.కృష్ణయ్య? ఆ పార్టీని వీడతారని ప్రచారం జరుగుతోంది. వైసీపీకి 11 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు రాజీనామా చేశారు. ఇక మిగిలిన వారిలో ఎక్కువ మంది బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో ఆర్.కృష్ణయ్యను తెలంగాణ బీజేపీ అక్కున చేర్చుకునేలా పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. బీసీ సంఘాల నేతగా కృష్ణయ్యకు తెలంగాణలో గుర్తింపు ఉంది. గతంలో ఎల్‌బీ నగర్ శాసనసభ్యుడిగానూ ఆయన పనిచేశారు. ఇప్పటికే బీసీ ముఖ్యమంత్రి నినాదం తీసుకున్న బీజేపీ.. బీసీ వర్గాల నేతను ఆకర్షించడం ద్వారా? వచ్చే ఎన్నికల నాటికి బీసీ ఓటర్లను పోలరైజ్ చేసేలా అడుగులు వేస్తోందని చెబుతున్నారు.వైసీపీ ఎంపీలతోపాటు కృష్ణయ్య బీజేపీలో చేరతారా? లేక సెపరేట్‌గా తెలంగాణ బీజేపీతో కలిసి అడుగులేస్తారా? అన్నది చూడాల్సి వుందంటున్నారు. వైసీపీ ఎంపీల పార్టీ ఫిరాయింపులపై ఒకరిద్దరు ఖండించినా, ఆర్.కృష్ణయ్య మాత్రం ఇప్పటివరకు తన స్పందన తెలియజేయలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్.కృష్ణయ్య రాజకీయ అడుగులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి ఎంఆర్‌పీఎస్ నేత కృష్ణ మాదిగ, బీసీ నేత ఆర్.కృష్ణయ్య ద్వారా మిషన్ 2028 కంప్లీట్ చేయాలనే బీజేపీ వ్యూహమే పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్ అవుతోంది. తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువ.. అదే సమయంలో ఎస్సీల్లో మాదిగల ఓట్లు అధికం.. దీంతో ఈ రెండు వర్గాలు తమతో కలిసి నడిస్తే అధికారం కైవసం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కానదేది కమలనాథుల వ్యూహం. అనుకున్న విధంగా అంతా పక్కాగా జరుగుతుందా? లేదా? అనేదే ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశం? ఇప్పటికే తన రాజకీయ ప్రవేశంపై మంద కృష్ణమాదిగ స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక ఆర్.కృష్ణయ్య స్పందన ఎలా ఉండబోతోందనేది ఆసక్తికరంగా మారింది.

# జానీ మాస్టర్ పై చర్యలెందుకు లేవు

**బీజేపీ నేత శిల్పారెడ్డి**

హైదరాబాద్: టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ యువతి (అసిస్టెంట్ కొరియోగరాఫర్)పై డ్యాన్స్ కొరియోగ్రాఫర్ షేక్ జానీ బాషా ( జానీ మాస్టర్ ) లైంగిక వేధింపుల ఘటనను తీవ్రమైన చర్యగా భావిస్తున్నామని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి అన్నారు. ఒక యువతిని ఐదేళ్ల పాటు నరకం చూపించడంతో పాటు, వేధింపులు, దాడులకు పాల్పడటం, మతం మారాలంటూ ఒత్తిళ్లకు గురిచేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇది లవ్ జిహాద్ కేసు. హిందూ అమ్మాయిని ట్రాప్ చేసినట్లు స్పష్టంగా ఎఫ్ఐఆర్ లో నమోదు చేసినప్పటికీ కేసును నీరుగార్చేందుకు నిందితుడిపై పనికిరాని కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇంతవరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గం. ఈ ఘటనకు కొందరు సినీ ఇండస్ట్రీ పెద్దలతో పాటు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలపై అత్యాచారాలు, హిందూ మహిళలను మతం మార్చి లైంగికంగా వేధించే ఘటనలు తీవ్రమైనా.. రాష్ట్ర ప్రభుత్వం చీమకుట్టినట్లు కూడా వ్యవహరించకపోవడం సిగ్గుచేటు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. దీనికి హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బాధ్యత వహించాలి×. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా హోంశాఖపై ఒక్కసారి కూడా సమీక్షించలేకపోవడంతో శాంతిభద్రతల పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఘటనలను తేలికగా తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ పై వేధింపులకు, లవ్ జిహాదీ చర్యలకు పాల్పడిన షేక్ జానీపై గతంలోనూ నేరచరిత్ర ఉందని, 2015లో ఓ కాలేజీలో మహిళపై దాడి కేసులో 2019లో మేడ్చల్ కోర్టు ఆరునెలల పాటు జైలుశిక్ష విధించినట్లు స్వయంగా పోలీసులే వెల్లడించారు. తాజాగా మరోసారి మహిళా డ్యాన్సర్ పై, మైనర్ గా ఉన్నప్పటి నుంచీ వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఈ కేసును చులకనగా తీసుకోవడాన్ని బిజెపి మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోంది. ఇటువంటి చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాగం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఈ కేసును విచారణను జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి, చట్టపరంగా పారదర్శకంగా విచారణను జరిపించేలా చర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని శిల్పా రెడ్డి హెచ్చరించారు .

# హైడ్రాతో పేద ప్రజల గూడు గల్లంత్తు



రాయపర్తి: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాతో పేద ప్రజల ఇండ్లను కూల్చుతూ గూడు లేకుండా చేయడం హేయమైన చర్య అని ఎంసీపీఐ (యూ) పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గుగులోత్ అరుణ్ నాయక్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉండి నిర్మాణాలు చేపట్టి, ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నటువంటి గృహ యజమానులకు ఎలాటి నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చడం సరికాదు అని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. భూములను కొనుగోలు చేసి అధికారుల అనుమతి తీసుకొని కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇల్లు కట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తూ పేద ప్రజలకు గూడు లేకుండా చేయడం హేయమైన చర్య అన్నారు. నివాసముంటున్న ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ హైడ్రా అంటూ పేద ప్రజల ఇండ్లను ధ్వంసం చేస్తున్నారు అని తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుంచి నివసిస్తున్న నిరుపేద ఇళ్లను కూల్చడమే నా ప్రజాపాలన అంటే అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైడ్రాలో ఇల్లు కోల్పోయిన పేద ప్రజలకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాయిత వెంకన్న, బుర్కా యాకయ్య, గుగులోత్ దేవుల, గుగులోత్ బాలు, మాన్సింగ్, కోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులకు లైన్ క్లియర్

వరంగల్: తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కుటుంబాల నుంచి వేరు పడిన వారు, పెళ్లిళు చేసుకున్నవారు కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు ఆశావాహులకు తెలంగాణ సర్కార్ తీపి కబురు చెప్పింది. అక్టోబర్ నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సోమవారం భేటీ అయిన కేబినెట్ సబ్ కమిటీ రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయం తీసుకుంది. కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.అయితే కొత్త రేషన్ కార్డుల అర్హతపై సస్పెన్స్ కొనసాగుతోంది. కార్డుల జారీకి లబ్ధిదారుల ఆదాయ పరిమితి, అర్హతలపై నిబంధనలను పున:సమీక్షిస్తామని చెప్పడంతో ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. బియ్యం అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్ కార్డులు ఇస్తామని చెప్పడంపైనా అనుమానాలున్నాయి. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షల్లోపు, పట్టణాల్లో రూ.2లక్షల్లోపు ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.అలాగే 3.5 ఎకరాలలోపు తడి, 7.5 ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్నవారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే ఏపీ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లో ఆదాయ పరిమితులు పరిశీలించామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రంలోనూ పరిమితి పెంచాలా? తగ్గించాలా? ప్రస్తుత నిబంధనలే కొనసాగించాలా? అనేదానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 21న ఈ అంశంపై తుది నిర్ణయం రానుంది.ప్రస్తుతం తెలంగాణలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈసారి కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా అందిస్తామని మంత్రుల సబ్ కమిటీ వెల్లడించింది. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అందిస్తామన్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీపై తుది ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 21వ తేదీన మరోసారి కేబినెట్ సబ్ కమిటీ సమావేశం కానుండగా.. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. అక్టోబర్‌లో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిచనున్నారు.

# గాడ్సే వారసుల చేతుల్లో భారత్

**- తీవ్రవాదుల్లా బీజేపీ నాయకుల వ్యాఖ్యలు**

**- రాహుల్‌ది దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన కుటుంబం**

**- ఆయనకు వస్తున్న ఆదరణ ఓర్వలేకే ఆరోపణలు : హన్మకొండలో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్**



హన్మకొండ చౌరస్తా: హన్మకొండ చౌరస్తా: బీజేపీ నాయకులు తీవ్రవాదుల్లా మాట్లాడుతున్నారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం రాహుల్ గాంధీదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా హన్మకొండ జిల్లా అంబేద్కర్ సెంటర్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. గాడ్సే వారసులు దేశాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని లెక్కచేయకుండా తీవ్రవాదుల్లా బీజేపీ నాయకులు మాట్లాడుతుంటే ప్రధాని మోడీ, మంత్రి అమిత్ షా.. చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆషామాషీ వ్యక్తి కాదని, ప్రధాని కావాల్సిన వ్యక్తిని పట్టుకొని.. నాలుక కోస్తా అనడమే కాక, టెర్రరిస్టుగా ముద్రవేయడం దారుణమన్నారు. ఆనాడు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వాళ్ళ సొంత ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాల కోసం ప్రాణాలు త్యాగం చేయలేదని, టెర్రరిస్టులను అదుపుచేసే క్రమంలో తమ ప్రాణాలనే పణంగా పెట్టారని గుర్తు చేశారు. మోడీ ఏ రోజైన దేశం కోసం జైలుకు వెళ్లిన దాఖలాలున్నాయా అని ప్రశ్నించారు. దేశంలో రాహుల్‌కి వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక బీజేపీ ఇలాంటి కుట్రలకు తెరలేపిందని విమర్శించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా గాంధీని అవమానించడమే కాక, రాహుల్ గాంధీని ఇందిరాగాంధీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని అన్నారు. బీజేపీ ఎంపీలు ఉగ్రవాదుల్లా మాట్లాడుతుంటే ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీజేపీ ఎంపీలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాహుల్ గాంధీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు రహీమున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ విగ్రహంపై రాద్ధాంతం...

హైదరాబాద్: అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రశ్నలు సహజం. ఆరోపణలు కూడా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండటం ప్రజాస్వామ్యానికి అవసరం. ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వాన్ని నిలబెట్టడం.. తప్పు చేస్తే ప్రజా కోర్టులో బోనెక్కించడానికి ప్రతిపక్షం పని చేయాలి. కానీ, ప్రతిపక్షం అయినంత మాత్రానా ప్రభుత్వంపై అక్కర్లేని ఆరోపణలు, అనవసర రాద్ధాంతాలు చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఏ పనికి శ్రీకారం చుట్టినా అడ్డుతగిలి ఆటంకపరచాల్సిన పనీ లేదు. అనవసర వాద ప్రతివాదనలు చేస్తూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడాన్ని ఎవరూ హర్షించరు. ఇప్పుడు విగ్రహంపై బీఆర్ఎస్ చేస్తున్న గొడవపై ఇలాంటి కామెంట్లే వినిపిస్తున్నాయి.కొత్త సచివాలయంలో తాము ఒక ఐలాండ్ ఏర్పాటు చేశామని, అందులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాము ఆలోచించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దశాబ్ద వేడుకల్లో ఆవిష్కరించాలని తాము భావించినట్టు చెప్పారు. ఇక్కడో గమ్మత్తు విషయమేమిటంటే.. బీఆర్ఎస్ ప్రకారం తెలంగాణ దశాబ్ది(నవాబ్ది) ఉత్సవాలు జరిగిపోయాయి. తొమ్మిదేళ్లకే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలంటూ వేడుకలు నిర్వహించింది, అది వేరే విషయం. తెలంగాణ తల్లి విగ్రహం కోసమని.. ఇప్పుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఎందుకు అభ్యంతర పెడుతున్నారనేది కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్న ప్రశ్న. తెలంగాణ తల్లి కొలువుదీరాల్సిన చోట ప్రతిష్ఠించిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తొలగించి గాంధీ భవన్‌కు పంపుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. వారు ఏం చేసుకున్నా తాము వెనక్కి తగ్గబోమని, తమ ప్రభుత్వం వచ్చాక ఇది చేసి తీరుతామన్నారు.తాము తెలంగాణ తల్లి విగ్రహానికి వ్యతిరేకం కాదని, ఇంకా చెప్పాలంటే.. ఈ డిసెంబర్ 9వ తేదీన ఇదే సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, అది తమ బాధ్యత అని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసేశారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ఏర్పాటుపై నాటి కేంద్ర ప్రభుత్వం తొలి ప్రకటన చేసింది. అదే రోజు సోనియా గాంధీ జన్మదినం కూడా. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఈ రోజే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ముహూర్తం ఫిక్స్ చేసింది.పదేళ్లు అధికారంలో ఉండి కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయని బీఆర్ఎస్‌కు ఇప్పుడు తాము సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టగానే ఆ విషయం ఎందుకు గుర్తుకు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. నాటి బీఆర్ఎస్ సర్కారు పెట్టకపోయినా తాము తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి తీరుతామని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తెలంగాణ తల్లికి అవమానం జరిగిందని, పాలాభిషేకాలతో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనకు పిలుపు ఇవ్వడంతో ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**